



శుక్రవారం 28.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 128 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# నేపాల్‌లో ప్రకృతి విలయం!

- 359కు చేరిన మృతులు.. 910 మంది గల్లంతు • ఆచూకీ తెలియని 288 మంది భారతీయులు
- కూలిన వంతెనలు.. తెగిన రహదారులు.. దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులు
- బాధితుల కోసం అత్యవసర సహాయ చర్యలు ముమ్మరం చేసిన భారత్ ప్రభుత్వం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నేపాల్‌ను ఆకస్మిక వరదలు, బురద ప్రవాహాలు అతలాకుతలం చేస్తున్నాయి. గంటగంటకూ మృతుల సంఖ్య పెరుగుతుండగా.. వందలాది మంది ఆచూకీ తెలియక కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. నేపాల్ పోలీసుల ప్రకారం మృతుల సంఖ్య 359 దాటగా.. సుమారు 910 మంది గల్లంతైనట్లు సమాచారం. వీరిలో 288 మంది భారతీయులు ఉండటం మరింత కలవరపెడుతోంది. జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పర్యాటకులు, యాత్రికులు వరదల బారినపడ్డారు. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లినవారితోపాటు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న భారతీయుల కుటుంబాలు తమ వారి క్షేమ సమాచారం కోసం ఎదురుచూస్తున్నాయి.

**288 మంది భారతీయులతో సంబంధాలు తెగిపోయాయి :** భారత విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. గల్లంతైన భారతీయుల్లో త్రిశూలి-1 జలవిద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది ఉన్నారు. తమిళనాడుకు చెందిన రెండు బృందాలు, పశ్చిమబెంగాల్, కేరళకు చెందిన పలువురు పర్యాటకులు, యాత్రికుల ఆచూకీ తెలియడం లేదు. వీరి వివరాల కోసం కాఠ్‌మాండూలోని భారత రాయబార కార్యాలయం నేపాల్ అధికారులతో, ప్రాజెక్టు యాజమాన్యాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. అయితే తమిళనాడుకు చెందిన 21 మంది

మిగతా 2లో...

## భారతీయుల కోసం హెల్ప్‌లైన్‌లు

**కాఠ్‌మాండూ భారత రాయబార కార్యాలయం:**

- +977 985 131 6807
- +977 970 910 7500
- +977 981 032 6117

**భారత్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్:**

- +91 11 2308 8718
- +91 11 2308 8719

**వాట్సాప్ కాల్స్, సందేశాలు:**

- +91 9968291988

## ఆచూకీ లేనివారిపై ప్రత్యేక దృష్టి!

- నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ వాసులపై సీఎం సమీక్ష
- గల్లంతైన ఏడుగురిని ట్రాక్ చేయాలి.. ప్రతి ఒక్కరినీ సురక్షితంగా తీసుకురావాలి

• వివరాలు 2 లో

## యాత్రికుల క్షేమమే లక్ష్యం!

- క్షేమ సమాచారం కోసం ఆర్టీజీఎస్ నిరంతర పర్యవేక్షణ
- కైలాస మానస సరోవర్ మార్గంపై ప్రత్యేక దృష్టి
- యాత్రికులందరూ సురక్షితంగా స్వస్థలాలకు చేరే వరకు పర్యవేక్షణ: లోకేశ్

• వివరాలు 2 లో



### పచ్చని ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి

# ప్రగతి ప్రణాళిక



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పచ్చని, స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ-గ్రీన్)ను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 37.42 లక్షల హెక్టార్లలో నోటిఫైడ్ అటవీ ప్రాంతం ఉండగా, ఇది రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 22.96 శాతంగా ఉంది. 2030 నాటికి 33 శాతం పచ్చదనాన్ని సాధించేలా దశలవారీ లక్ష్యాలను నిర్దేశించారు.

ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో ఏపీ-గ్రీన్ కార్యకలాపాలను సమన్వయం చేయనున్నారు. రాష్ట్ర స్థాయి పాలక మండలికి పవన్ కళ్యాణ్ చైర్మన్‌గా, ఏపీ-గ్రీన్ చైర్‌పర్సన్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

# వేడుకకు వెళ్లి.. విగతజీవులై!

- తిరుగు ప్రయాణంలో మృత్యుఘోష
- పల్నాడులో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకే గ్రామానికి చెందిన ఏడుగురి మృతి
- ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు.. మరో 8 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో నలుగురు చిన్నారులు.. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స




**చిలకలూరిపేట(జర్నలిస్ట్ ఫైల్) :** పండగలా వెళ్లిన ఆ కుటుంబాలకు.. తిరుగు ప్రయాణం తీరని విషాదాన్ని మిగిల్చింది. పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆనందంగా ఇంటికి తిరిగి వస్తున్న వారిని రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో కబళించింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురు చిన్నారులు ఉండటం మరింత విషాదాన్ని నింపింది.



మిగతా 2లో...

# అమరావతికి 'క్వాంటమ్' కళ!



- దేశంలోనే తొలి క్వాంటమ్-ఏఐ విశ్వవిద్యాలయం
- రూ.730 కోట్లతో నైలిట్ ప్రాంగణం.. 8.5 ఎకరాల కేటాయింపునకు ఆమోదం
- సెప్టెంబర్ 13 నుంచే తరగతులు.. ఏఎన్‌యూలో తాత్కాలిక ఏర్పాట్లు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతిని అత్యాధునిక సాంకేతికత, పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా క్వాంటమ్, కృత్రిమ మేధస్సు విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని అమరావతిలో ఏర్పాటు చేయనున్నారు.

మిగతా 2లో...

# రాజధాని గ్రామాలకు మహర్దశ!

- రూ.1,437 కోట్లతో మౌలిక వసతుల జోరు
- 29 గ్రామాల్లో రహదారులు.. డ్రైనేజీ.. తాగునీరు.. వీధి దీపాలు
- గతంలో మంజూరైన రూ.904 కోట్లకు అదనంగా రూ.533 కోట్లు



• వివరాలు 3 లో

# గిరిజన విద్యార్థులకు 'ఎక్సలెన్స్' బాట!

- నీట్, ఐఐటీ-జేఈఈ శిక్షణకు ప్రత్యేక కేంద్రం
- 600 మందికి ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్..
- 300 మంది బాలురు, 300 మంది బాలికలు
- ఐఐటీలు, నిట్‌లు, ఎయిమ్స్ ప్రవేశాలే లక్ష్యం




• వివరాలు 3 లో

# జూనియర్ డాక్టర్లకు మెరుగైన సౌకర్యాలు

## కనీస వసతులు కల్పించకపోతే సూపరింటెండెంట్లపై చర్యలు

- జూడా డిమాండ్లపై ప్రభుత్వ ఉన్నతస్థాయి కమిటీ భేటీ
- ఆరు డిమాండ్లపై చర్చలు
- ఐదింటి పట్ల ఆందోళన అక్కర్లేదని చెప్పిన ప్రభుత్వం
- స్టైపెండ్ పెంపుపై మరో విడత చర్చిస్తామని వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హైకోర్టు ఆదేశాలననుసరించి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతస్థాయి కమిటీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) ప్రతినిధులతో గురువారం తొలివిడత చర్చలు జరిపింది. జూడాలు పేర్కొన్న ఆరు డిమాండ్లలో ఐదింటి పరిష్కారం పట్ల కమిటీ ఆందోళన అక్కర్లేదని పేర్కొంది మిగిలిన స్టైపెండ్ పెంపు డిమాండ్‌పై జూడా ప్రతినిధులతో మరోమారు చర్చిస్తామని కమిటీ తెలిపింది.

మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం కమిటీ ఛైర్మన్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ అధ్యక్షతన సుమారు 2 గంటలపాటు జరిగింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు. జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ తరఫున అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ భార్గవ్, ఇతర ప్రతినిధులు హాజరయ్యారు.

**ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పెంపు:** ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పెంపుపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి విధానపరమైన



మిగతా 2లో...



## పచ్చని ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రగతి ప్రణాళిక



(మొదటి పేజీ తరువాయి)

అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, పరిశ్రమలు, జలవనరులు, పట్టణ స్థానిక సంస్థలతో పాటు నాబార్డ్, సీఎస్ఆర్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు, పౌర సమాజ ప్రతినిధులను అనుసంధానించి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు నాయకత్వంలో బాధ్యతాయుతమైన, పారదర్శకమైన వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు.

ఫార్మ్ ఫారెస్ట్రీ, అగ్రో ఫారెస్ట్రీ, అవెన్యూ ప్లాంటేషన్లు, కాలువ గట్లు, షెల్టర్ బెల్ట్‌లు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొక్కల పెంపకంతోపాటు పచ్చదనం క్షీణించిన భూములు, మైనింగ్ ప్రభావిత ప్రాంతాలు, బంజరు భూములు, ఎకో సెన్సిటివ్ జోన్ల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రైతులు, స్వయం సహాయక సంఘాలు, విద్యా సంస్థల భాగస్వామ్యంతో నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా నర్సరీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తారు. జీఐఎస్, జియో–ట్యాగింగ్, డిజిటల్ మానిటరింగ్ ద్వారా మొక్కల పెంపకం, మనుగడ, గ్రీన్ కవర్ పెరుగుదలను నిరంతరం పర్యవేక్షించనున్నారు.

ఏపీ–గ్రీన్ కార్యక్రమాలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలతోపాటు నాబార్డ్, సీఎస్ఆర్ నిధులు, కార్బన్ ఫైనాన్స్, కార్బన్ క్రెడిట్లు, గ్రీన్ బాండ్లు, జిల్లా ఖనిజ నిధి, ఎకో–టూరిజం వంటి వివిధ వనరుల ద్వారా నిధులు సమీకరించనున్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో మూడంచెల వ్యవస్థ ద్వారా కార్యక్రమాలను అమలు చేయనున్నారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన గ్రీన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మండల స్థాయిలో ఎంజీఐసీల ద్వారా కార్యకలాపాలను మిషన్ మోడ్‌లో నిర్వహించనున్నారు. నెలవారీ, మూడు నెలలు, ఆరు నెలలు, వార్షిక లక్ష్యాలను నిర్దేశించి పురోగతిని సమీక్షిస్తారు.

పచ్చదనం పెంపును పర్యావరణ పరిరక్షణకే పరిమితం చేయకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించనున్నారు. చెట్ల ఆధారిత జీవనోపాధి, ప్రకృతి ఆధారిత ఉపాధి అవకాశాలను పెంచడం, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలకు ఆదాయ మార్గాలను సృష్టించడం ద్వారా పచ్చదనంతో పాటు గ్రామీణాభివృద్ధికి బాటలు వేయనున్నారు. వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి భవిష్యత్ తరాలను రక్షిస్తూ, ప్రతి గ్రామాన్ని పచ్చదనపు ఛత్రం కిందకు తీసుకురావడమే ఏపీ–గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.

## వేడుకకు వెళ్లి.. విగతజీవులై!



(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆటోలో మొత్తం 15 మంది ఉన్నారు. బస్సు వేగంగా ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జయింది. క్షణాల్లోనే అక్కడి పరిస్థితి హృదయవిదారకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు.

**వేడుకకు వెళ్లి.. విషాదంతో ఇంటికి :** చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వీరంతా బాపట్ల జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకలకు వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. తమ వారు క్షేమంగా ఇంటికి చేరుకుంటారని ఎదురుచూస్తున్న కుటుంబాలకు తెల్లవారుజామునే విషాద వార్త అందింది. దీంతో వేలూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

**ఘటనా స్థలంలోనే నలుగురు.. :** ప్రమాద తీవ్రతకు నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించిన వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందారు. మృతులను బొంతా బాబు (62), బొంతా మణెమ్మ (55), సంపూర్ణమ్మ (70), లక్ష్మమ్మ (75), గంగమ్మ (50), చౌటపల్లి సువార్త (45), మరియమ్మ (45)గా గుర్తించారు.

**చిన్నారుల పరిస్థితిపై ఆందోళన :** ప్రమాదంలో గాయపడిన ఎనిమిది మందిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో నలుగురు చిన్నారులు ఉండటంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. అప్పటివరకు తమతో ఉన్న ఆప్తులను కోల్పోయిన కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

**గ్రామంలో కన్నీటి సంద్రం :** ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు ఒకేసారి మృత్యువాత పడటంతో వేలూరులో విషాదం నెలకొంది. వేడుకకు వెళ్లిన వారు ఇలా విగతజీవులుగా తిరిగిరావడంతో గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. తమ వారిని కోల్పోయిన కుటుంబాల ఆవేదన స్థానికులను కలచివేసింది. ప్రమాదానికి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# ఆచూకీ లేనివారిపై ప్రత్యేక దృష్టి!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. మానస సరోవర్ యాత్ర వెళ్లిన ఏపీకి చెందిన పలువురు యాత్రీకులు నేపాల్ వరదల్లో చిక్కుకున్నారని అధికారులు సీఎంకు తెలిపారు. వీరికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్టు ఇప్పటివరకు గుర్తించామని, వీరిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరించాల్సి ఉండటంతో ప్రస్తుతం కొందరు అక్కడే చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. కర్నూలు–ఆదోని ప్రాంతానికి చెందిన నలుగురు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని వారితో తాము మాట్లాడమని వివరించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండూలో సురక్షితంగా ఉన్నారని



వారిని కూడా ఆర్టీజీఎస్ నుంచి సంప్రదించినట్టు అధికారులు చెప్పారు. ఇక చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు చెందిన ఏడుగురు గల్లంతు అయ్యారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఏడుగురిలో ముగ్గురు ఈషా ఫౌండేషన్ తరపున మానస సరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వారి ఫోన్లు అందుబాటులో లేవని అధికారులు సీఎంకు వివరించారు. బాధిత కుటుంబాలకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్ లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం సమాచారాన్ని సేకరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వంతో పాటు... ఖాట్మంటూ, చైనాల్లోని ఎంబసీలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరణతో పాటు అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షిత తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కష్టాల్లో ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తాజా వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

# యాత్రికుల క్షేమమే లక్ష్యం!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరద పరిస్థితుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి నేపాల్ వెళ్లి వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాలమీద రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఐటీ, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆర్టీజీఎస్ అధికారులు, సిబ్బందిని రంగంలోకి దించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పలవురు కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లారు. ఆకస్మిక వరదల నేపథ్యంలో కొంతమంది అక్కడ చిక్కుకున్నారు. వీరందరి ఆచూకీ తెలుసుకుని వారి యోగక్షేమాలు కనుక్కునేలా మంత్రి లోకేష్ ఆర్టీజీఎస్ యంత్రాంగాన్ని ఆదేశించి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. తెలుగు ప్రజల భద్రతకు సంబంధించి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత ఏజెన్సీలతో సమర్థవంతమైన సమన్వయం ఏర్పాటు చేసి, నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలకు అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఆర్టీజీఎస్ తన పర్యవేక్షణ, సమాచార సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. ఆర్టీజీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, సీఈఓ ప్రఖర్ జైన్‌లు అటు ఏపీ భవన్, ఇటు ఏపీ ఎన్ఆర్టీలను సమన్వయపరచుకుని పరిస్థితులను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అటు ఏపీ భవన్ అధికారులకు, ఇటు సీఎంఓ, ఐటీ మంత్రికి అందజేశారు. తిరుపతి నుంచి మానస సరోవర్ యాత్రకు వెళ్లి నేపాల్ లో చిక్కుకున్న యాత్రికు బృందం ఆచూకీ తెలుసుకుని వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వీరంతా ఖాట్మాండులోని ఒక హోటల్‌లో సురక్షితంగా




ఉన్నారు. వీరితో పాటు నేపాల్‌లో ఇలాగే పలు ప్రాంతాల్లో చిక్కుకున్న యాత్రికుల వివరాలన్నీ వివిద మార్గాల ద్వారా సేకరించారు. ఆర్టీజీఎస్ బృందం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని ధృవీకరించుకుంటూ ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని న్యూ ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులకు అందజేస్తోంది. తద్వారా బాధితులకు తక్షణ సహాయం, భద్రత, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు చర్యలు తీసుకోవడానికి మార్గం సుగమమయ్యేలా చేసింది.

**రియల్ టైమ్ ట్రాకింగ్, సమన్వయం :** నేపాల్‌లో వరద ప్రభావిత ప్రాంతాల గుండా ప్రయాణిస్తున్న తెలుగు యాత్రికులకు సంబంధించిన సమాచారాన్ని ఆర్టీజీఎస్ నిశితంగా పర్యవేక్షిస్తోంది. ముఖ్యంగా కైలాస మానస సరోవర్ యాత్రికులు ఉపయోగించే నేపాల్––టిబెట్ మార్గంపై ప్రత్యేక దృష్టి సారించింది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, క్రాస్ వెరిఫికేషన్ చేస్తూ, ఏపీ భవన్‌తో పాటు ఇతర సంబంధిత సంస్థలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తోంది. ఆర్టీజీఎస్ అందించిన సమాచారం ఆధారంగా ఏపీ భవన్ అధికారులు విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులు, చైనా అధికారులతో సమన్వయం ఏర్పరుచుకుని నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ యాత్రికులను సురక్షితంగా తీసుకొచ్చే చర్యలను ప్రారంభించింది. బాధితులకు సంబంధించిన యోగక్షేమాల గురించి వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో కోసం ఏపీ భవన్లో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమును ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**ఆర్టీజీఎస్ నుంచి నిరంతర పర్యవేక్షణ :** నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యాత్రికులందరూ క్షేమంగా తిరిగి వారి స్వస్థలాలకు చేరుకునేంత వరకు ఆర్టీజీఎస్ 24 గంటలూ నిరంతరాయంగా పర్యవేక్షించాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రీకులందరి సురక్షితంగా తిరిగి వారి స్వస్థలాలకు చేరేంత వం–కు ఆర్టీజీఎస్ అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

## జూనియర్ డాక్టర్లకు మెరుగైన సౌకర్యాలు

## కనీస వసతులు కల్పించకపోతే సూపరింటెండెంట్లపై చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశంపై అవసరమైనప్పుడు జూడా ప్రతినిధులతో చర్చిస్తామని కార్యదర్శి వీరపాండియన్ తెలిపారు.

**నాన్ క్లినికల్ వైద్యుల పోస్టుల భర్తీ :** నాన్ క్లినికల్ వైద్యుల పోస్టుల భర్తీలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారమే ప్రభుత్వం వ్యవహరిస్తోందని కార్యదర్శి స్పష్టం చేశారు. మొత్తం పోస్టుల్లో 30 శాతం వరకు ఎంఎస్సీ, పిహెచ్డీ, ఇతర అర్హతలు కలిగిన వారితో భర్తీ చేసేందుకు ఎన్ఎంసీ మార్గదర్శకాలు అనుమతిస్తున్నాయని తెలిపారు. అయితే ఇప్పటివరకు 11.05 శాతం పోస్టులను మాత్రమే ఈ విధానంలో భర్తీ చేసినట్లు వెల్లడించారు.

**జూనియర్ వైద్యులకు నిర్ణీత పని వేళలు, కనీస సౌకర్యాలు :** జూనియర్ వైద్యులకు నిర్ణీత పని వేళలు, అవసరమైన కనీస సౌకర్యాల కల్పనకు సంబంధించి ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ద్వారా అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసినట్లు కార్యదర్శి తెలిపారు. ఆదేశాల అమలులో నిర్లక్ష్యం



వహించే సూపరింటెండెంట్లపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**సీనియర్ రెసిడెంట్ల స్టైపెండ్ :** సీనియర్ రెసిడెంట్ల స్టైపెండ్ అంశాన్ని ప్రభుత్వం వేరుగా పరిశీలిస్తుందని తెలిపారు. సీనియర్ రెసిడెంట్లు జూడా పరిధిలోకి రారని కార్యదర్శి వీరపాండియన్ స్పష్టం చేశారు.

**ఇంటర్న్‌లు, పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల స్టైపెండ్:** ప్రస్తుతం ఇంటర్న్‌లకు 10 శాతం, పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు 3 శాతం చొప్పున స్టైపెండ్ పెంచుతామని కార్యదర్శి తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ప్రతి ఏడాది మూడు శాతం చొప్పున పెంచుతామని పేర్కొన్నారు. అయితే స్టైపెండ్‌ను 13 శాతం చొప్పున పెంచాలని జూడా ప్రతినిధులు కోరారు. ఈ అంశం పై మరో విడత చర్చ నిర్వహిస్తామని కార్యదర్శి వెల్లడించారు.

# నేపాల్‌లో ప్రకృతి విలయం!

(మొదటి పేజీ తరువాయి)

భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు అధికారులు ప్రకటించడం కొంత ఊరటనిచ్చింది. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కొనసాగుతున్నాయి.

**కుటుంబాల్లో అంతులేని ఆందోళన :** వరదల ఉద్ధృతికి వేలాది ఇళ్లు కొట్టుకుపోయాయి. పలు ప్రాంతాల్లో అడుగుల మేర బురద పేరుకుపోయింది. వంతెనలు, రహదారులు ధ్వంసమవడంతో అనేక ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో బాధితులను సంప్రదించడం కష్టంగా మారింది. విదేశీయుల పరిస్థితిపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆస్ట్రేలియాకు చెందిన పలువురు యాత్రికులు, ట్రెక్కర్లు గల్లంతయ్యారు. కాఠ్‌మాండూలో ఉన్న మలేషియా పౌరులతోనూ సంబంధాలు తెగిపోయినట్లు సమాచారం. న్యూజిలాండ్‌కు చెందిన కొందరు కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

వరదల ధాటికి 35 వంతెనలు, 45 సస్పెన్షన్ వంతెనలు, సుమారు 40 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమైనట్లు ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. తొమ్మిది జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిగా దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాఠ్‌మాండూను ఇతర ప్రాంతాలతో అనుసంధానించే నాగ్దుంగా–ముగ్లింగ్ జాతీయ రహదారితోపాటు తొమ్మిది జిల్లాల్లోని కీలక మార్గాలపై రాకపోకలు నిలిచిపోయాయి.

విపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్న భారతీయులను గుర్తించి సురక్షితంగా తరలించేందుకు భారత ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. బాధిత కుటుంబాలు తమ వారి వివరాలను అధికారులకు తెలియజేసి సమాచారం పొందేలా ప్రత్యేక హెల్ప్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది.

## అమరావతికి 'క్వాంటమ్' కళ!



(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసం రాజధాని ప్రాంతంలో 8.5 ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు సీఆర్డీఏ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. సుమారు రూ. 730.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం వంద శాతం గ్రాంట్–ఇన్–ఎయిడ్ నిధులు సమకూర్చనుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. క్వాంటమ్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్ రూపకల్పన, తయారీ, ఇతర అధునాతన సాంకేతిక రంగాల్లో విద్య, నైపుణ్య శిక్షణ, పరిశోధనలు, ఆవిష్కరణలను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఏకైక విశ్వవిద్యాలయమైన నైలిట్‌కు పంజాబ్‌లోని రూప్‌నగర్‌లో ప్రధాన ప్రాంగణంతో పాటు దేశవ్యాప్తంగా 56 కేంద్రాలు, 11 రాజ్యాంగ విభాగాలు, 700కు పైగా గుర్తింపు పొందిన సంస్థల నెట్‌వర్క్ ఉంది. అమరావతి కేంద్రంగా డీప్‌టెక్ రంగంలో ప్రపంచస్థాయి విద్య, పరిశోధనలకు వేదికను అభివృద్ధి చేయనున్నారు.

**సెప్టెంబర్ 13 నుంచి ఏఎన్‌యూలో తరగతులు:** శాశ్వత ప్రాంగణ నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి ఉండకుండా వచ్చే నెల 13 నుంచి గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తాత్కాలిక వసతుల ద్వారా తరగతులు ప్రారంభించనున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు––యంత్ర అభ్యసనం, డేటా సైన్స్, సెమీకండక్టర్ తయారీ, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, అధిక సామర్థ్య కంప్యూటింగ్ తదితర రంగాల్లో అండర్‌గ్రాడ్యుయేట్, పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా, ఎగ్జిక్యూటివ్ కోర్సులను అందించనున్నారు.

అమరావతి శాశ్వత ప్రాంగణంలో 1.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్వాంటమ్ పరిశోధన, ఆవిష్కరణ, ఇంక్యుబేషన్ బ్లాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో క్వాంటమ్ ఫోటోనిక్స్, క్రయోజెనిక్ వ్యవస్థలు, క్లీన్‌రూమ్, నానో ఫ్యాబ్రికేషన్, డేటా సెంటర్లు, స్టార్టప్ సహకార కేంద్రాలు, సాంకేతిక బదిలీ, పేటెంట్ విభాగాలను ఏర్పాటు చేస్తారు. విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలు కలిసి సాంకేతిక ఆవిష్కరణలను వాణిజ్య స్థాయికి తీసుకెళ్లేందుకు ఇవి దోహదపడనున్నాయి.

**ఐదేళ్లలో 8,250 మందికి శిక్షణ:** ఈ ప్రాజెక్టు ద్వారా ఐదేళ్లలో 8,250 మందికి ప్రయోజనం చేకూరనుంది. ఇందులో 1,650 మంది డిగ్రీ, పీజీ కోర్సుల ద్వారా, మరో 6,600 మంది నైపుణ్య ధ్రువీకరణ కార్యక్రమాల ద్వారా శిక్షణ పొందనున్నారు. అమరావతిలో నిర్మించే శాశ్వత ప్రాంగణాన్ని సౌర విద్యుత్, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ సదుపాయాలతో పర్యావరణహితంగా, నెట్–జీరో లక్ష్యంతో తీర్చిదిద్దనున్నారు. 500 మందికి వసతి కల్పించే హాస్టళ్లు, ఆడిటోరియం, క్రీడా ప్రాంగణాలు, అతిథి అధ్యాపకుల కోసం వసతి సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

జాతీయ క్వాంటమ్ మిషన్, ఇండియా ఏఐ మిషన్, ఇండియా సెమీకండక్టర్ మిషన్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీ సిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూలతో నైలిట్ భాగస్వామ్యం కానుంది. జాతీయ స్థాయి విద్యాసంస్థ ఏర్పాటుతో అమరావతి డీప్‌టెక్ హబ్‌గా అభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్ర యువతకు అధునాతన సాంకేతిక రంగాల్లో విద్య, పరిశోధన, అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయి.

## కెఆర్ కృష్ణయ్య శెట్టి వర్ధంతి వేడుకలు




**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారి మఠం మండలంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు అవోపా మండల యూనిట్ వారు అవోప హోండా కేఆర్ కృష్ణయ్య శెట్టి గారికి ఘనంగా పుష్పాంజలి ఘటించరి.

ఈ కార్యక్రమంనకు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన అధ్యక్షులు అయ్యపు వెంకటసురేష్ బాబు అధ్యక్షులు ముచ్చర్ల శేషయ్య కార్యదర్శి పత్తి సురేష్ కోశాధికారి బింగి సూర్యనారాయణ గౌరవ అధ్యక్షులు పత్తి వెంకటేశ్వర్లు ఆలయ కార్యదర్శి సుంకు సురేష్ బాబు జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగిశెట్టి వీరసతీష్ సభ్యులు వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## 28న తెనాలిలో ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని శుక్రవారం తెనాలిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమం తెనాలి మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మరియు స్థానిక శాసన సభ్యులు నాదెండ్ల మనోహర్, జిల్లా అధికారులు, నియోజకవర్గంలోని మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులకు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ వివరించారు.

# కూటమి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి



## ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు 'రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి–సంక్షేమం' పేరుతో నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారంలో భాగంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పట్టణంలోని 25 వార్డుల్లో పర్యటించారు. కూటమి నాయకులు, అధికారులతో కలిసి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, దేశంలోని మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం నుంచి తరలిపోయిన పరిశ్రమలను తిరిగి తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఆలపాటి తెలిపారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడంతో పాటు రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ రైతు భరోసా, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆలపాటి తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13 వేల చొప్పున జమ చేసినట్లు వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యంగా అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# చిలకలూరిపేట ఘోర రోడ్డు ప్రమాదంపై బీజేపీ మాధవ్ తీవ్ర సంతాపం

- ఏడుగురు మృతి పట్ల దిగ్భ్రాంతి - క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం పట్ల ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.

విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమన్నారు. మరో పది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసి ఆందోళన వ్యక్తం చేశారు. మృతులు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారని, ప్రకాశం జిల్లా కొండమందులూరు నుంచి వేలూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసిందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, ఈ కష్ట సమయంలో వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే తీసుకోవాలని అధికారులను పివిఎన్ మాధవ్ కోరారు. బాధిత కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదానికి గల పూర్తి కారణాలపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, బాధ్యత ఎవరిదైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆటో డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపినట్లు వస్తున్న ఆరోపణలపై కూడా నిజానిజాలను విచారించి, నిర్లక్ష్యం తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పివిఎన్ మాధవ్ అన్నారు.

మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పివిఎన్ మాధవ్ తెలిపారు.

# అధికారంలో ఒక నీతి.. ప్రతిపక్షంలో మరో రీతి జగన్‌ది



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** అధికారంలో ఉన్నప్పుడు ఒక నీతి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో రీతిలో మాట్లాడటం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నైజమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ విమర్శించారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2021 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఏకగ్రీవాలను ప్రోత్సహించిన జగన్ ఇప్పుడు వాటినే ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా చిత్రీకరించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. నాడు ఏకగ్రీవమైతే కోట్లాది రూపాయల నజరానాలు ప్రకటించిన ప్రభుత్వం, నేడు ఏకగ్రీవాలను వ్యతిరేకించడంపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న ఘటనలు, దాడులు, నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కున్న సందర్భాలను ప్రజలు మర్చిపోలేదన్నారు. 2021లో ఏకగ్రీవాలను ప్రోత్సహించిన ప్రభుత్వం తప్పా, 2026లో వాటిని వ్యతిరేకిస్తున్న జగన్ మాట తప్పా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని యామిని శర్మ తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. పోలవరం ప్రాంతంలో రహదారి అనుసంధానం, అమరావతి--ఖరగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, అమరావతి, పోలవరం, భోగాపురం విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన జగన్ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సిందిపోయి ప్రతి అంశానికీ రోడ్డెక్కుతామని ప్రకటించడం సరికాదని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని సూచించారు.

వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు హిందుత్వం, హిందువుల సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని యామిని శర్మ విమర్శించారు. వైసీపీ హయాంలో ఆలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం, మత మార్పిడుల ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాకినాడలో సౌజన్య కుటుంబానికి సంబంధించిన ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో బీజేపీ, హిందూ సంఘాలు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అప్పట్లో కనిపించని హిందుత్వం ఇప్పుడు ఎలా గుర్తొచ్చిందని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పును ఎదుర్కొనేందుకు వైసీపీ సిద్ధపడాలని, ఎన్నికలు ఏకగ్రీవమైనా, పోటీ జరిగినా ప్రజల నిర్ణయమేనని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రజలు ఎన్డీఏ కూటమికి అండగా నిలుస్తారని యామిని శర్మ ధీమా వ్యక్తం చేశారు.

# రాజధాని గ్రామాలకు మహర్దశ!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో రూ. 1,437 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశ నిర్ణయాలను ఆయన సచివాలయంలో మీడియాకు వెల్లడించారు. శాఖమూరులో రూ. 596 కోట్లతో సెంట్రలైజ్డ్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, హ్యూమన్ రిసోర్స్ భవనాల నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. 29 రాజధాని గ్రామాల్లో రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు, వీధి దీపాల ఏర్పాటుకు నిధులు వినియోగించనున్నట్లు చెప్పారు. గతంలో మంజూరైన రూ. 904 కోట్లతో కలిపి మొత్తం రూ. 1,437 కోట్లతో గ్రామాల్లో నూటికి నూరు శాతం మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

రాజధాని గ్రామాల్లో ప్రస్తుతం ఒక్కొక్కరికి రోజుకు 40 లీటర్ల నీరు మాత్రమే సరఫరా అవుతోందని, ఇకపై నిబంధనల ప్రకారం రోజుకు 135 లీటర్ల తాగునీరు అందించేలా పైపులైన్లను పూర్తిగా మార్చేందుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. మంగళగిరి పట్టణానికి రోజుకు 30 ఎంఎల్‌డీ నీటిని కిలోలీటర్‌కు రూ. 10 చొప్పున సరఫరా చేసేందుకు అనుమతి లభించిందని, భవిష్యత్తులో పట్టణానికి 80 ఎంఎల్‌డీ నీరు అవసరమవుతుందని తెలిపారు. ట్రంక్ రోడ్లకు ల్యాండ్ టు ల్యాండ్ స్థలం కల్పించేందుకు అదనంగా రూ. 533 కోట్లకు ఆమోదం లభించిందన్నారు. సీఆర్ఆర్ఐ న్యూఢిల్లీ, ఐఐటీ ఖరగ్‌పూర్ నిపుణుల సూచనల మేరకు 54 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న రహదారులను కూడా సీసీకి బదులుగా బీటీ రోడ్లుగా నిర్మించేందుకు అథారిటీ అంగీకరించిందని చెప్పారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్‌కు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు తెలిపారు.

మిక్స్‌డ్ యూజ్ కింద ప్రైవేట్ సంస్థలకు భూములు కేటాయించేందుకు పిచ్చికలపాలెంలో 7.9 ఎకరాలు, తుళ్లూరులో 5 ఎకరాలు, మందడంలో 12.38, 6 ఎకరాలు, కూరగల్లులో 6 ఎకరాలు కలిపి మొత్తం 42 ఎకరాలను గుర్తించి ఆర్ఎఫ్‌పీ పిలిచేందుకు అనుమతి లభించిందన్నారు. నిబంధనల ప్రకారం కేటాయించిన భూమి కంటే అదనంగా భూమి కోరే పాఠశాలలు, హోటళ్లు తదితర సంస్థలకు ఎకరా ప్రాథమిక విలువ రూ. 4.1 కోట్లకు 250 శాతం అధికంగా, సుమారు రూ. 10.25 కోట్ల చొప్పున చెల్లిస్తే భూమి కేటాయించేందుకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డీమ్డ్ యూనివర్సిటీ నిర్మాణానికి 8.5 ఎకరాలు కేటాయించేందుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. గ్రీన్ ఎనర్జీ మౌలిక వసతుల అభివృద్ధికి ఐఓసీఎల్‌తో ఎంఓయూ కుదుర్చుకునేందుకు సీఆర్డీఏకు అనుమతి లభించిందని తెలిపారు.

కంతేరు, తాడికొండ ప్రాంతాల మీదుగా నిర్మించనున్న ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్ల వరకు రాజధాని ప్రాంతం నుంచి ఉన్న భూములను ల్యాండ్ పూలింగ్ కింద తీసుకునేందుకు సీఆర్డీఏ అథారిటీ అనుమతించిందని మంత్రి నారాయణ తెలిపారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చే రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని, 2026 జనవరి 6వ తేదీకి ముందు తీసుకున్న వ్యవసాయ రుణాల్లో రూ. 1 లక్ష వరకు మాఫీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అన్ని పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వసతులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# గిరిజన విద్యార్థులకు 'ఎక్సలెన్స్' బాట!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా మారికవలసలోని రెసిడెన్షియల్ స్కూల్ ప్రాంగణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన నీట్, ఐఐటీ–జేఈఈలకు సన్నద్ధమయ్యే గిరిజన విద్యార్థులకు ఈ కేంద్రంలో నాణ్యమైన రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నట్లు వెల్లడించారు. ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులను ఐఐటీలు, నిట్‌లు, ఎయిమ్స్, ప్రముఖ వైద్య కళాశాలలు, ఇతర జాతీయ ప్రాధాన్యత కలిగిన ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించేందుకు ప్రతిభ ఆధారంగా మొత్తం 600 మంది గిరిజన విద్యార్థులను ప్రభుత్వం ఎంపిక చేసిందని తెలిపారు. లింగ సమానత్వానికి ప్రాధాన్యం ఇస్తూ 300 మంది బాలురు, 300 మంది బాలికలకు సమాన ప్రాతినిధ్యంతో ప్రవేశాలు కల్పించినట్లు వివరించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు వసతి, ఆహారం, పౌష్టికాహారం, ఇతర అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని సంస్థ కార్యదర్శి పేర్కొన్నారు. కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫర్నిచర్, సమాచార సాంకేతిక పరికరాలు, మానవ వనరుల ఏర్పాటుకు ప్రత్యేక నిధులను ప్రాధాన్యతా ప్రాతిపదికన మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధిత శాఖల సమన్వయంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.

గిరిజన విద్యార్థుల విద్యా పురోగతికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని సంస్థ కార్యదర్శి తెలిపారు. భవిష్యత్తులో గిరిజన విద్యార్థులను ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల్లో ముందుకు తీసుకెళ్లడంతో పాటు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సన్నద్ధం చేసే ఉత్తమ నమూనా సంస్థగా ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టం చేశారు.

# నేపాల్ జలప్రళయం...తెలుగు రాష్ట్రాల బాధితులకు అండగా బీజేపీ

- ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** నేపాల్–టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక జలప్రళయం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. భోటే కోశి నదిలో ఒక్కసారిగా ఉధృతంగా వచ్చిన వరదలతో రసువ జిల్లాలో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు.

వరదల ధాటికి అనేక గ్రామాలు కొట్టుకుపోవడంతో పాటు జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసం కావడం ఆ ప్రాంతంలో పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గల్లంతైన వారి ఆచూకీ త్వరగా లభించాలని, సహాయక చర్యలు వేగవంతం కావాలని ఆకాంక్షించారు.



**తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు సురక్షితంగా బయటపడాలి :** నేపాల్‌లో చిక్కుకుపోయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పర్యాటకులు, యాత్రికులు, ఇతరుల క్షేమంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని పీవీఎన్ మాధవ్ కోరారు. ముఖ్యంగా విశాఖపట్నానికి చెందిన పలువురు అక్కడ చిక్కుకున్నట్లు వచ్చిన సమాచారంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వారంతా సురక్షితంగా స్వస్థలాలకు చేరేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నాయని, చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి అన్ని విధాలా సహకారం అందించాలని కోరారు.

**పర్యావరణ పరిరక్షణపై అప్రమత్తం కావాలి :** హిమాలయ ప్రాంతాల్లో వాతావరణ మార్పులు, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల ఇటువంటి ప్రకృతి విపత్తుల తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని పీవీఎన్ మాధవ్ అన్నారు. హిమాలయ గ్లేషియర్ల పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రపంచ దేశాలు సమష్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సహకారాన్ని నేపాల్ కు అందిస్తోన్న విషయం గుర్తు చేశారు.

నేపాల్ ప్రజలకు, ఈ విపత్తులో నష్టపోయిన కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ తరఫున అండగా ఉంటామని పీవీఎన్ మాధవ్ భరోసా ఇచ్చారు.

# రూ.7.73 లక్షల సీఎంఆర్ఎఫ్ వైద్య సాయం



- లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వేమూరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురు అనారోగ్య బాధితులకు మొత్తం రూ. 7,73,839 విలువైన వైద్య సహాయం మంజూరైంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వైద్య ఖర్చులకు సంబంధించిన వివరాలను నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫారసు లేఖల ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించారు. పరిశీలన అనంతరం అర్హులైన బాధితులకు లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం మంజూరు చేసింది.

చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన బొమ్ము శివ నాగేంద్రమ్మకు రూ. 1,43,980, భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన వంగర శ్రీనివాసరావుకు రూ. 3,04,159, భట్టిప్రోలు మండలం పల్లికోన గ్రామానికి చెందిన చిలక ప్రేమానందానికి రూ. 3,25,700 చొప్పున వైద్య సాయం మంజూరైంది. ముగ్గురికి కలిపి రూ. 7,73,839 ఆర్థిక సహాయం అందింది.

మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తోందన్నారు. అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని తెలిపారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హెచ్ పీవీ టీకా (వ్యాక్సిన్) పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 98.47 శాతం పూర్తయినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ బారి నుంచి సంరక్షించే చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సిన్ ను 14-15 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. స్వర్ణ గ్రామ/వార్డు లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి 14 ఏళ్లు వచ్చి 15 ఏళ్లు దాటని బాలికలు 3,45,377 మంది ఉండగా వీరిలో గురువారం మధ్యాహ్నం నాటికి 3,40,108 మంది (98.47%)కి వ్యాక్సిన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన 5,269 మంది బాలికలకు ఈ నెల 31లోగా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం ద్వారా మొదట్లో ఉన్న అపోహలు దూరం కావడంతో తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారని మంత్రి పేర్కొన్నారు.

తొలుత ఆగస్టు చివరి నాటికి నిర్దేశించిన వారికి వ్యాక్సిన్ పంపిణీ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 98.47% మేర పురోగతి సాధించడం విశేషం. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ తక్కువగా ఉందన్న ఉద్దేశంతో డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గురువారం సమాచారాన్ని పంపించింది. అలాగే 14 ఏళ్లు నిండిన బాలికలకు కూడా వ్యాక్సిన్ ఇచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం త్వరలో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను రాష్ట్రానికి పంపించబోతుంది. 14 ఏళ్ల బాలికలు తల్లిదండ్రులతో కలిసి vaccine kosam నేరుగా పీహెచ్సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లాలనిఅధికారులు సూచించారు. వ్యాక్సిన్ పంపిణీ పురోగతిని అనుసరించి కేంద్రం రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత ఇస్తోంది. ఈ వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభమైన అనంతరం రెండు దపాలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780 డోసులు రాష్ట్రానికి అందాయి. దీనికి సమర్థంగా సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. డిసెంబరు 31 అనంతరం హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీని రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో జతచేస్తారు.

**రియాక్షన్ కేసులు లేవు: కమీషనర్ చక్రధర్ బాబు :** వ్యాక్సిన్ పొందిన 3.40 లక్షల మంది బాలికలకు సంబంధించి ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు తెలిపారు. " గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నివారించడంలో హెచ్ పీవీ వ్యాక్సిన్ కీలకపాత్ర పోషిస్తోంది.

# ప్రజాసంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం..
- అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందాలి: రాష్ట్ర మంత్రి సీతక్క



**మంగపేట, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని గంపోనిగూడెం "రైతు వేదిక"లో ఎంపీడీవో బి. బద్రు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమా నికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 43 మంది అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ కు సంబంధించిన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. చేయూత పింఛన్ పథకానికి, రేషన్ కార్డుకు అర్హత ఉండి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మంగపేట ఎంపీడీవో బి.బద్రు నాయక్, ఐకేపీ ఏపీఎం సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, ఆత్మ డైరెక్టర్ గాదె శ్రావణ్, భద్రాచలం రామాలయం బోర్డు సభ్యులు పూజారి సురేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మిలాద్-ఉన్-నబీ సందర్భంగా రక్తదాన శిబిరం

- మహబూబ్‌నగర్‌లో రక్తదాన శిబిరానికి హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



**దేవరకద్ర, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా 'టీమ్ సోషల్ వర్కర్స్', మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రక్తదాన శిబిరాన్ని నిర్వహించినందుకు, సమాజ సేవలో అంకితభావంతో కృషి చేస్తున్నందుకు 'టీమ్ సోషల్ వర్కర్స్' సభ్యులను, స్వచ్ఛంద కార్యకర్తలను అభినందించారు. స్వచ్ఛంద రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, రక్తదానం అనేది విలువైన ప్రాణాలను కాపాడగలిగే ఒక గొప్ప కార్యమని ఆయన పేర్కొన్నారు. రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, క్రమం తప్పకుండా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన ప్రోత్సహించారు. రక్తదాతల విలువైన సహకారాన్ని అభినందించడంతో పాటు, ప్రజలలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకుల కృషిని కూడా ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 'టీమ్ సోషల్ వర్కర్స్' సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, రక్తదాతలు మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యం - ప్రజాసేవే నా మార్గం

- భాదితులకు పరామర్శ ఆర్థిక సాయం



**మంగపేట, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మంగపేట మండలం లోని ఓ బాధిత కుటుంబ సభ్యులకు శ్రీరామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్, బారసా పార్టీ ములుగు జిల్లా నాయకులు బాడిశ నాగరమేష్ బుధవారం పరామర్శ చేసి ఆర్థిక సహాయం అందజేశారు. ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామనికి చెందిన పాయం లక్ష్మయ్య ఇటీవల అనారోగ్య కారణాలతో చనిపోగా గ్రామస్తులచే విషయం తెలుసు కున్న "శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్" చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు బాడీశ నాగ రమేష్ బుధవారం ఆ కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి పరామర్శించి, వారికీ మనోధైర్యం చెప్పి మాజీ గ్రామ అధ్యక్షులు చేతుల మీదుగా రూ, 4000 లు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో మల్లూరు మాజీ గ్రామ అధ్యక్షులు సోయం ఈశ్వర్, నిమ్మగూడెం మాజీ అధ్యక్షులు కొమరం పుల్లారావు, బ్రాహ్మణ పల్లి మాజీ అధ్యక్షులు పంద శ్రీను, అక్కినే పల్లి మాజీ అధ్యక్షులు రూప భద్రయ్య, బారసా సీనియర్ నాయకులు చక్రధరి, అప్పన్నగారి లక్ష్మీనారాయణ, తొలేం విశ్వనాథం, మురళి, శేఖర్, కుంజా వెంకటేష్, రేగా ప్రశాంత్, ఎం. డి అజ్జు పాషా, నన్నెబోయిన కుమార్ పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుకు భూక్య జంపన్న భరోసా

- శంకరాజు పల్లిలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు శ్రీకారం



**ఏటూర్ నాగారశీ, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న సూచన మేరకు ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం లాంచనంగా ప్రారంభించారు. మూడు నెలలపాటు ఈ శిక్షణ కొనసాగనుంది. భూక్య జంపన్న చొరవతో గ్రామీణ యువతకు కంప్యూటర్ విద్యను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక యువత హర్షం వ్యక్తం చేస్తోంది. జాడి మౌనిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, టైపింగ్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ వినియోగం, ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం, డిజిటల్ సేవలపై శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉద్యోగ సాధనకు ఎంతో కీలకమని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక విద్య అందక అవకాశాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు భూక్య జంపన్న చేస్తున్న కృషి అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని యువత తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# పంజుగులలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- మసీదు నుంచి మైబు స్వామి దర్గా వరకు ప్రత్యేక కార్యక్రమం
- మజీదు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం



**కల్వకుర్తి ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని మసీదు నుంచి మైబు స్వామి దర్గా వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మత పెద్దలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ప్రవక్త మహమ్మద్ సందేశాలను స్మరించుకుంటూ సోదరభావం, శాంతి, ఐక్యతకు ప్రాధాన్యమిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం మజీదు కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి పలువురికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా మత సామరస్యాన్ని చాటారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మహమ్మద్ రావుఫ్, ఖాజా, మాసూమ్, జాంగీర్, మౌలానా, ఆరీఫ్, ఇమ్రాన్, ముజీబ్, ఇబ్రహీం, మాలిక్, సలాం, పాషా, షబ్బీర్, మహమూద్, అన్వర్, సమ్మద్, ముస్తఫా, షాబుద్దీన్, మద్దుమ్ అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

# రెండవ విడత ఇందిర్మ ఇండ్ల గుడిసెల జాబితా నిర్ణిత వ్యవధిలోగా పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్...
- ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, గుడిసెల జాబితా సమర్పణపై సమగ్ర సమీక్ష.
- గుడిసెల జాబితాను సమర్పించని మండలాల అధికారుల తీరుపై అసంతృప్తి...
- పెండింగ్ సమాచారాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తక్షణమే జిల్లా కార్యాలయానికి నివేదించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ



**దేవరకద్ర, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇందిరమ్మ ఇండ్ల మంజూరికి గుడిసెల జాబితా నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేసి వెంటనే సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కార్యాలయం నుండి వెబెక్స్ ద్వారా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, డివిజనల్ ఇంజనీర్లు (DEs), మరియు అసిస్టెంట్ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, గుడిసెల జాబితా సమర్పణపై మహబూబ్ నగర్ జిల్లా ప్రాతిపదికన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ మండలాల నుండి అందిన స్థితిగతుల నివేదికలను వివరంగా పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటివరకు నివేదికలు గుడిసెల జాబితాను సమర్పించని మండలాల అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమాచారాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తక్షణమే జిల్లా కార్యాలయానికి నివేదించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరమైన తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహబూబ్ నగర్ జిల్లా గృహ నిర్మాణ శాఖ పి.డి.,ఉపేందర్ రెడ్డి, డి.ఈ.లు, ఏ.ఈ.లు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# మిలాద్-ఉన్-నబీ సందర్భంగా రక్తదానం

- ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్
- 392 యూనిట్ల రక్తదానం..
- రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసిన జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్
- రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి



**దేవరకద్ర, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా గత ఎనిమిది సంవత్సరాలుగా మహబూబ్‌నగర్ టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆల్మాస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో మొత్తం 392 యూనిట్ల రక్తాన్ని దాతలు స్వచ్ఛందంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్ మాట్లాడుతూ.. రక్తదానం అనేది అత్యంత విలువైన సామాజిక సేవ అని, మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం అత్యవసర పరిస్థితుల్లో ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, ముఖ్యంగా యువతలో రక్తదానంపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మిలాద్-ఉన్-నబీ వంటి పవిత్ర సందర్భాన్ని సేవా కార్యక్రమంతో అనుసంధానం చేసి భారీ స్థాయిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినంద నీయమన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా నిరంతరంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ, ఆపదలో ఉన్న వారికి రక్తం అందేలా కృషి చేస్తున్న మహబూబ్‌నగర్ టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను జిల్లా ఎస్పీ అభినందించారు. అలాగే రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందించి, వారి సేవకు గుర్తింపుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్య క్రమంలో మహబూబ్‌నగర్ టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ బశ్వర్, మహమ్మద్ ఇజాజ్, వైస్ ప్రెసిడెంట్, మహమ్మద్ అబ్దుల్లా సెక్రటరీ, ముఖ్య సభ్యులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీప్‌సైడ్ బ్లాక్ "కోసం కృషి చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే పాయం కృతజ్ఞతలు



**ఏటూరునాగారం, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మణు గూరు సింగరేణి ఓసీ-2 డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణి సంస్థకు వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకుని, ఎంతో కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క ని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణి పరిధిలోకి తీసుకురావడంలో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క చూపిన ప్రత్యేక శ్రద్ధ, చొరవకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ని శాలువాతో ఘనంగా సత్కరించి, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి పవిత్ర ప్రసాదాన్ని అందజేశారు. మణుగూరు ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యత కలిగిన సింగరేణి ఓసీ-2 డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణి సంస్థ పరిధిలోకి రావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మరింత పెరగడంతో పాటు, కార్మికులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబాలకు ప్రయోజ నం చేకూరుతుందని ఎమ్మెల్యే పాయం పేర్కొన్నారు. అదే విధం గా మణుగూరు, పినపాక నియోజకవర్గంతో పాటు భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో పారిశ్రామిక, ఆర్థిక మరియు మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిర్ణయం మరింత ఊతమిస్తుందని తెలిపారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మణుగూరు ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత లభించేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. పినపాక నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ సహకారంతో మణుగూరు ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## జమియా మసీదులో
# నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమం

- పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి
- జమియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం...
- రూ.5 లక్షల నిధులతో ఈద్గా విస్తరణ పనులు ప్రారంభం...



**దేవరకద్ర, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర నియోజకవర్గం, భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్‌లో మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని జమియా మసీదులో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని, ముస్లిం సోదర, సోదరీమణులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జమియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే GMR.తదనంతరం 5 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన ఈద్గా విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన
# సర్పంచ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మహాలక్ష్మి వెంకట నరసయ్య



**నర్సంపేట ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖానాపూర్ మండల పరిధి లోని బోడిమిదితండా గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆవుల రవి పై అదే గ్రామ సర్పంచ్ భూక్యా భానుప్రసాద్ భౌతిక దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము అని ఖానాపురం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకట నరసయ్య అన్నారు. ప్రభుత్వ అధికారిగా తన గ్రామపంచాయతీలో జరిగే అభివృద్ధి పనులు, అక్రమాలను తన పై అధికారులకు తెలియజేయడం కార్యదర్శి బాధ్యత. తన బాధ్యతను నిజాయితీ గా నిర్వహించినందుకే కార్యదర్శిని దూషించడం, కొట్టడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలో ఏ ఒక్క గ్రామంలో కూడా ఇలాంటి సంఘటనలు జరగలేదు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ కావడం వల్లనే తనను ఎవరూ ఏమీ చేయలేరనే అహంకారంతోనే ఈ దాడికి పాల్పడ్డారు.విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారిపై దాడి చేసిన సర్పంచ్ భూక్యా భానుప్రసాద్ పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలి.సదరు సర్పంచ్ ను సర్పంచ్ పదవి నుండి తొలగించి, సస్పెండ్ చేయాలి. కాంగ్రెస్ పార్టీ నుండి కూడా అతన్ని సస్పెండ్ చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ అధికారులకు భరోసా కల్పించాలి. ఆయన సూచించారు.

## రామచంద్రపూర్ గ్రామంలో
# "తీజ్ పండుగ" వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క!



**మల్లంపల్లి, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామ చంద్రపూర్ గ్రామంలో బంజారాల "తీజ్ పండుగ" సందర్భంగా బుధవారం రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క వేడుకల్లో పాల్గొని బంజారా సోదరి సోదరులతో సరదాగా మాట్లాడి బంజారా సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. బంజారా సంఘం నాయకుల వినతులకు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం తరపున సహకరిస్తామని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, సింగిల్ విండో చైర్మన్ బొక్కా సత్తి రెడ్డి, ఆత్మ కమిటీ ములుగు చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి స్థానిక సర్పంచ్ దొంతి స్వరూప ప్రతాప్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు హాట్కర్ స్వామి, సీనియర్ నాయకులు, బంజారా సంఘం నాయకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురం ఎస్సైని కలిసిన టిఆర్‌పి నాయకులు



**ములుగు, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు, ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్, వెంకటాపురం మండల అధ్యక్షులు శ్రీరామ నాగ సునీల్, మండల ఉపాధ్యక్షులు బొల్లె సారయ్య, వెంకటాపురం ఎస్సై తిరు పతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన మరియు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కారం కోసం కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే క్రమంలో పోలీసు శాఖతో సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. అనంతరం వెంకటాపురం ఎస్సైని శాలువాతో సత్కరించి మర్యాద పూర్వకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మీలాద్-ఉన్-నబీ పర్వదినం..



**మిర్యాలగూడ ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపురం 47వ వార్డులో కౌన్సిలర్ ఎండి.ఫారుక్, మాజీ కౌన్సిలర్ ఎం.ఎ.ఘని, ముస్లిం సోదరులు నిర్వహించిన పవిత్ర మీలాద్-ఉన్-నబీ పర్వదిన కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ పాల్గొని ముస్లిం సోదరులకు మీలాద్-ఉన్-నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు మానవాళికి శాంతి, సోదరభావం, ప్రేమ, కరుణ, ఐక్యత వంటి గొప్ప విలువలను అందించాయన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలు సోదరభావంతో పరస్పర గౌరవంతో కలిసి మెలిసి జీవించేలా కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు. ప్రజలందరి సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వమే తన ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం మిఠాయి, షర్బత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, ఒకటో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కోడిరెక్క ఇంద్రకుమార్, కౌన్సిలర్ షేక్ జావీద్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి..



**హుజూర్ నగర్ ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** భవన నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన హుజూర్ నగర్ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వెన్నబోయిన ఉదయ్ (39) మటన్ మార్కెట్ పరిధిలో గుండా గోపి ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొంటుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.సమాచారం అందుకున్న ఎస్ఐ నరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఉదయ్ మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య పుణ్యవతి, కుమారుడు హేమంత్, కుమార్తె ప్రణీత ఉన్నారు. ఉదయ్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.

## కష్టకాలంలో రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం

### - గంగపుత్ర కుటుంబాలకు అండగా సహాయనిధి ఫౌండేషన్



**హైదరాబాద్, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** గంగపుత్ర కుటుంబాల్లో ఆపద సమయంలో అండగా నిలిచే లక్ష్యంతో గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం, సహాయనిధి ఫౌండేషన్ రెండు బాధిత కుటుంబాలకు మొత్తం రూ.80 వేల ఆర్థిక సహాయం అందజేసింది. అకాల మరణం చెందిన ఆరేపల్లి గ్రామానికి చెందిన బింగి నర్సయ్య కుటుంబానికి సంఘం తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కష్టకాలంలో మనోధైర్యంగా ఉండాలని సంఘం నాయకులు కోరారు. అదేవిధంగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కాలుకు శస్త్రచికిత్స అనంతరం కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిన మేడి రాజేందర్ కుటుంబానికి వైద్య ఖర్చుల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బింగి రాజు, గంగపుత్ర కడెం మండల అధ్యక్షులు మేడి రాజేందర్, జుంబర్తి మల్లేష్, జుంబర్తి నరేందర్, జుంబర్తి కృష్ణ, గుమ్ముల నరేష్, అసంపెల్లి మధుకర్, జుంబర్తి నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేటలో మిలాద్-ఉన్-నబి వేడుకలు



**బేగంపేట్, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** బేగంపేట్‌లో బుదవారం మిలాద్ నబి వేడుకలు ఘనంగా జరిగాయి. బేగంపేట, ప్రకాష్ నగర్ డివిజన్లో జరిగిన ఈ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ యువ నేత, తెలంగాణ ఉద్యమకారుడు రాగ నాగరాజు గౌడ్ హాజరయ్యారు. మైనార్టీలందరికీ మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు. ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిరు, సిద్దిక్, అజార్, అర్షద్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## బాలయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

### : వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్..



**శేరిలింగంపల్లి, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** హాఫీజ్‌పేట్ డివిజన్ ప్రేమ్‌నగర్‌కు చెందిన బాలయ్య (60) జులై 28న కురిసిన భారీ వర్షాల సమయంలో నాలాలో ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యారని, ఇప్పటి వరకు ఆయన ఆచూకీ లభించకపోవడం బాధాకరమని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ అన్నారు. బాలయ్య కుటుంబాన్ని పరామర్శించిన వాసిలి, ఆయన భార్య పద్మను ఓదార్చారు. బాలయ్య ఆచూకీ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఒక న్యాయం, డబ్బున్న వారికి మరో న్యాయం ఉండకూడదని, ప్రజల ప్రాణాల విషయంలో ప్రభుత్వం సమానంగా స్పందించాలని అన్నారు. బాలయ్య కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వాసిలి డిమాండ్ చేశారు. బాలయ్య పిల్లలకు మున్సిపల్ శాఖలో ఉద్యోగాలు కల్పించాలని, పద్మకు వెంటనే రెండు పడకల ఇల్లు కేటాయించాలని, రూ.50 లక్షల పరిహారం అందించాలని కోరారు. 2019 ఆగస్టులో చందానగర్ డివిజన్ పీజేఆర్ రోడ్డులోని నాలాలో శ్రీకాంత్‌రెడ్డి (35) మృతి చెందిన ఘటనను వాసిలి గుర్తుచేశారు. అప్పట్లో తన సొంత నిధుల నుంచి రూ.1.50 లక్షలు శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి అందించానని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఆయన భార్యకు ప్రభుత్వం తరఫున ఉద్యోగం, తగిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలాల చుట్టూ పటిష్టమైన కంచెలు ఏర్పాటు చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నాలాల చుట్టూ భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. బాలయ్యను తిరిగి తీసుకురాలేకపోయినా, కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వాసిలి తెలిపారు. బాలయ్య ఆచూకీ కోసం గాలింపు చర్యలను వేగవంతం చేసి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మంగపేటలో "చేయూత" పెన్షన్ల పంపిణీ

### - తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క..



**మంగపేట, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం నూతన "చేయూత" పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖ మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తదితర వర్గాల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ములుగు జిల్లాకు ప్రజా ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, చెక్‌డ్యామ్‌లు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఏటూరునాగారం నుంచి దుగనిపల్లి వరకు జాతీయ రహదారి అభివృద్ధికి రూ.43 కోట్ల నిధులు,కాటాపూర్ నుంచి మంగపేట వరకు రహదారి అభివృద్ధికి రూ.16 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి సీతక్క వెల్లడించారు. చేయూత పెన్షన్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఒంటరి మహిళలు, వికలాంగులు తదితర అర్హులైన వారికి ప్రత్యేకంగా పెన్షన్లు అందిస్తూ వారి జీవనానికి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ములుగు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని మంత్రి సీతక్క అన్నారు. ఇటీవల ములుగులోని మల్లూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధి గురించి ప్రస్తావించిన సందర్భంలో, మంగపేటలోని శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాఠశాలలు, దేవాలయాలు, రహదారులు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ ప్రజల సంక్షేమం,అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి ఎంపీడీవో భద్రు నాయక్, జిల్లా పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి,ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీను, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్, మార్కెట్ కమిటీ సభ్యులు కొమురం బాలన్న, జిల్లా ఆత్మ కమిటీ సభ్యులు గాదె శ్రావణ్ కుమార్ మహిళా అధ్యక్షురాలు శానం నిర్మల, జిల్లా కార్యవర్గ సభ్యులు పాయం అనిత జిల్లా యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్, మండల యూత్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి
- ఎమ్మెల్యే పాయం, మాజీ ఎమ్మెల్యే రేగాలకు "తుడుందెబ్బ" నేతల హితవు



**ఏటూరునాగారం, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** పినపాక నియోజకవర్గంలో తాజా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పరస్పరం చేసుకుంటున్న వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలు, దూషణలను తక్షణమే నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి "తుడుందెబ్బ" రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి డిమాండ్ చేశారు. ఇద్దరూ ఆదివాసీ సమాజానికి చెందిన నాయకులై ఉండి, ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఒకరిపై ఒకరు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటూ కార్యకర్తలను, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన ఈ ఇద్దరు నాయకులను పినపాక ప్రజలు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా గెలిపించి గౌరవించారని, ఆ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.అదే సమయంలో నియోజకవర్గంలో ఇంకా ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటి పరిష్కారంపై దృష్టి సారించాల్సిన నాయకులు వ్యక్తిగత ఆరోపణలతో కాలం గడపడం సరికాదన్నారు. ప్రజా సమస్యలు, ఆదివాసీల భూ హక్కులు, ఉపాధి, విద్య, వైద్యం, అభివృద్ధి అంశాలపై చర్చ జరగాలని సూచించారు. "ఆదివాసి పరువును బజారుకు ఈడ్చకండి" అని అలెం కోటి హెచ్చరించారు. ఒకరి తర్వాత ఒకరు ప్రెస్మీట్లు పెట్టుకుని పరస్పరం విమర్శలు చేసుకోవడం ద్వారా ఆదివాసీ సమాజాన్ని చులకన చేసే పరిస్థితి తీసుకురావొద్దన్నారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చు కానీ వాటిని ప్రజా సమస్యల పరిష్కారానికి అడ్డంకిగా మార్చడం సమంజసం కాదన్నారు. ఎవరిపై ఎలాంటి అభియోగాలున్నా వాటిని పరిశీలించడానికి న్యాయస్థానాలు, విచారణ సంస్థలు ఉన్నాయని, ప్రజా సమస్యలపై ఎవరు నిజాయితీగా పనిచేస్తారో ప్రజలే ప్రజాప్రతినిధుల ప్రతి కదలికను నిశితంగా గమనిస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా నేతలు వ్యక్తిగత ఆరోపణలకు ఫుల్ స్టాప్ పెట్టి, నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి విజ్ఞప్తి చేశారు.

# కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ అండ



**ఏటూరు నాగారం, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కునూరు కిష్టాలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలికి ఫ్రాక్చర్ కావడంతో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఆయనను పరామర్శించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ గారి సూచనలతో కిష్టాలు గారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, ధైర్యం చెప్పారు. మండల కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.10,000 ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, ఆర్ .టి.ఏ మెంబెర్ వసంత శ్రీనివాస్,జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ తాజ్, జిల్లా సెక్రటరీ ఎండీ ఖలీల్ ఖాన్,ఏటూరునాగారం డివిజన్ ఆత్మ చైర్మన్ కర్ల అరుణ, వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొండగొర్ల పోషయ్య,శివాలయం చైర్మన్ మాడుగురి ప్రసాద్,టౌన్ అధ్యక్షులు కే రంజిత్,టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్,వార్డ్ మెంబెర్ ఉమ్మనేని రమేష్, గోపాల్,డైరెక్టర్లు,సర్పంచులు,జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్టీయు పాపన్నపేట మండల కమిటీ ఎన్నిక

### - అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, సురేష్



**పాపన్నపేట, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** పాపన్నపేట మండల పిఆర్టీయు అధ్యక్ష, కార్యదర్శులుగా పంతులు రాజు, దాసరి సురేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మంగళవారం సాయంత్రం ప్రాథమికోన్నత పాఠశాల ఎల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన మండల పిఆర్టీయు సర్వసభ్య సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా సంతోష్ కుమార్, ఫసియోద్దీన్, మహిళ అసోసియేట్ అధ్యక్షులుగా స్వరూపారాణి, లక్ష్మి, ఉపాధ్యక్షులుగా సిద్దయ్య, నాగేశ్వర్, మహిళా ఉపాధ్యక్షులుగా శ్రావణి, అశ్విని, కార్యదర్శులుగా సురేష్, నవీన్ కుమార్, మహిళా కార్యదర్శులుగా చంద్రకళ, శ్రావణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, డిఏలు ,పిఆర్సి, సిపిఎస్ రద్దు, జీవో నెంబర్ 25న రద్దు, ప్రాథమిక తరగతులకు తరగతి ఒక ఉపాధ్యాయుడిని నియమించడం వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 1న పిఆర్టీయు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సతీష్ రావు, సామ్యా నాయక్ సంఘ పెద్దలు వెంకట్రాంరెడ్డి ,సుంకరి కృష్ణ , సబ్బని శ్రీనివాస్, మహేష్, తాళ్ల శ్రీనివాస్, అంజనా చారి, భవాని ప్రసాద్, సతీష్ గౌడ్, ప్రభాకర్ రావు, పోచయ్య, రాజయ్య, ప్రవీణ్, రాఘవేందర్, టేక్మాల్ అధ్యక్షులు అమీరుద్దీన్, మెదక్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారులుగా భీమ్లా నాయక్ రాఘవేందర్ లు వ్యవహరించారు.

### బీసీలను అవమానిస్తే వచ్చే ఎన్నికల్లో

## తగిన గుణపాఠం చెబుతాం..

### : పెద్దయ్య యాదవ్..

**ఏటూరునాగారం, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు నియోజకవర్గ కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్ మాట్లాడుతూ, బీసీ మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, గతంలో మంత్రి పదవి రాలేదనే కారణంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైకోమటి రెడ్డి రాజ గోపాల్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేసిన సందర్భంలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీసీ ప్రజా ప్రతినిధులను కనీసం మనుషులుగా కూడా గౌరవించని విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.వచ్చే ఎన్నికల్లో బీసీల ఓట్లు అడిగే ముందు బీసీల పట్ల రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని, బీసీలను అవమానించే నాయకులకు ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన గుణపాఠం చెబుతామని పెద్దయ్య యాదవ్ హెచ్చరించారు.అలాగే ముఖ్యమంత్రి, ఆయన సోదరులపై వస్తున్న భూ ఆక్రమణల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## ఓటర్ల జాబితాపై అన్ని గ్రామాలలో గ్రామ సభలు..

**తాడ్వాయి, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** నేడు తాడ్వాయి మండలంలోని అన్ని గ్రామాలలో ఉదయం 10 గంటలకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా పై ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ శ్వేత తెలిపారు.గురువారం ఉదయం 10 గంటలకు ఈ గ్రామసభ ఉంటుందని ఆమె వివరించారు.

ఇటీవల ఎస్ఐఆర్లో నమోదు చేసిన వివరాల ప్రకారం ఓటర్ జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదా అనే విషయమై గ్రామ సభలో ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లు చదువుతారని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు తప్పిపోయిన వారి పేర్లు గుర్తిస్తారని తెలిపారు.18 సంవత్సరాలు నిండినవారు ఫార్మ్ 6 లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ గ్రామ సభల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొంటారన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శ!



### - బియ్యం, నగదు అందజేసిన కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ నాయకులు

**కన్నాయిగూడెం, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వివిధ గ్రామాల్లో మరణించిన కుటుంబాలను పరామర్శించి పెద్దకర్మకు 50 కేజీల బియ్యం అందజేసారు. మండలంలోని సర్వాయి గ్రామ పంచాయతీ పరిధిలో చిట్యాల గ్రామానికి చెందిన కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు బొచ్చు సూరయ్య అనారోగ్యంతో ఇటీవల గత వారం రోజుల కిందట మరణించడం జరిగింది కావునా రేపు వారి పెద్దకర్మ ఉండగా కన్నాయిగూడేం మండల కాంగ్రేస్ నాయకులు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసి వారికీ వారి కుటుంబానికి కాంగ్రేస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు.అదేవిధంగా అనంతరం ముప్పనపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ తిప్పనపల్లి లక్ష్మయ్య తండ్రి తిప్పనపల్లి నర్సయ్య గత నాలుగు రోజుల కిందట అనారోగ్యంతో మరణించడం జరిగింది వెంటనే తెలుసుకున్న మండల కాంగ్రేస్ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి సర్పంచ్ లక్ష్మయ్యకీ దైర్యం చెప్పి వారికి వారి కుటుంబంబానికి కాంగ్రేస్ పార్టీ అండగా ఉంటుంది అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు(సర్పంచ్ )జాడి రాంబాబు, జిల్లా కాంగ్రేస్ సీనియర్ నాయకులు ఎండీ, అప్సర్ పాషా,బీసీ సెల్ మండల అధ్యక్షులు గద్దం నాగేష్,ఎస్సిసెల్ మండల అధ్యక్షులు ఎస్సి ఎస్టీ మానేటీరింగ్ కమిటీ మెంబెర్ సునార్కని రాంబాబు,బీసీ జేఏసి అధ్యక్షులు ముదురుకొల్లా బిక్షపతి, సర్వాయి సర్పంచ్ కోరం నర్సయ్య, మాజీ సర్పంచ్ ఆలం చిరంజీవి, మండల సీనియర్ నాయకులు కంటెం రఘువులు బంధం రాఘవులు, సుధాకర్, రాజబాబు,మాజీ ఉప సర్పంచ్ జంగా కృష్ణ,ఎండీ షాయక్,తిప్పనపల్లి బుచ్చయ్య, మండల యూత్ నాయకులు జాడి నరేష్, కుమ్మరి కుమార్,తిప్పనపల్లి రాజు,జనగాం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## సింగపూర్ విద్యా పర్యటనకు ఉపాధ్యాయుడి ఎంపిక



**రాయికల్, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
విదేశీ విద్యా అధ్యయన పర్యటనకు రాయికల్ మండలానికి చెందిన ఉపాధ్యాయుడు ఎంపికయ్యారు. కుమ్మరి పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కడకుంట్ల అభయ్‌రాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విదేశీ విద్యా అధ్యయన కార్యక్రమంలో భాగంగా సింగపూర్ పర్యటనకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 19 నుంచి 26 వరకు జరిగే ఈ పర్యటనలో సింగపూర్‌లో అమలవుతున్న ఉత్తమ బోధనా విధానాలు, విద్యా వ్యవస్థను అధ్యయనం చేయనున్నారు. అక్కడి వినూత్న బోధనా పద్ధతులను పరిశీలించి, వాటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఈ సందర్భంగా అభయ్‌రాజ్‌ను జిల్లా విద్యాధికారి రాము, రాయికల్ మండల విద్యాధికారి రాఘవులు, మండల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు. విదేశీ విద్యా పర్యటనకు స్థానిక ఉపాధ్యాయుడు ఎంపిక కావడం పట్ల మండలంలో హర్షం వ్యక్తమవుతోంది.

## ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు




**తాండూర్, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఇస్లాం మత చివరి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సాహెబ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈద్-ఏ-మిలాద్-ఉన్-నబీ వేడుకలను తాండూర్ మండల కేంద్రంతో పాటు ఐబీలో ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐబీలో ప్రత్యేకంగా ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ప్రవక్త ముహమ్మద్ సాహెబ్ సందేశాలను స్మరించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాండూర్ సీఐ దేవయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, యువకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే లక్ష్యంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### నల్లబెల్లి మండల పీఏసీఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు



**నల్లబెల్లి, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
పేద ప్రజలకు ప్రభుత్వ రేషన్ సేవలను మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నల్లబెల్లి మండలంలో కొనసాగింది. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని లేంకాలపల్లి, నల్లబెల్లి, గోవిందాపురం, కన్నారావుపేట, బుచ్చిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీల్లో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. నల్లబెల్లి మండల పీఏసీఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రఘుపతిరావు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో గతంలో వేలిముద్రలు పడకపోవడం, ఓటీపీ వంటి సాంకేతిక సమస్యలతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కారంగా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించడంతో పాటు లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు చార్ల శివారెడ్డి, జిల్లా మునేందర్, బత్తిని మల్లయ్య, బుచ్చిరెడ్డిపల్లి సర్పంచ్ భూక్య భద్రమ్మ, మండల ఆర్ఐ కృష్ణస్వామి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దూరి తిరుపతిరావు, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి గద్దల సురేష్, వార్డు సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రేషన్ కార్డు లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మంజునాథపురం కాలనీ సమస్యలు పరిష్కరించండి

### - ములుగు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన కాలనీ ఓనర్స్,కమిటీ



**ములుగు, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
జిల్లా కేంద్రం మంజునాథపురం కాలనిలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంజునాథపురం కాలనీ కమిటీ,ఓనర్స్ ప్రతినిధులు ములుగు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మంజునాథపురం కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం,డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలని కోరారు.అలాగే కాలనీలో రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని,వీధిలైట్లను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.కాలనీలో నెలకొన్న ఇతర సమస్యలను కూడా వివరించి తక్షణమే పరిష్కరించాలని కోరారు.సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు మంజునాథపురం కాలనీ కమిటీ సభ్యులు తెలిపారు.

## కాంగ్రెస్ సేవాదళ్ వ్యవస్థాపకుడు హార్డికర్ వర్ధంతి




**తాండూర్, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ సేవాదళ్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్.ఎస్. హార్డికర్ (నారాయణ్ సుబ్బారావు హార్డికర్) వర్ధంతి వేడుకలను తాండూర్ లో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవాదళ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇందూరి గట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డా. పెద్దబోయిన శంకర్, ఉపాధ్యక్షులు మొమీన్ అలీ, నాయకులు కట్కాల మల్లేష్, పెద్దబోయిన రవీందర్, రాజేశం, ప్రణీత్ మేడి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ వేడుకల్లో దేశ రక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

### ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహకార్యవాహ్ ప్రముఖ్ తిరుమల్ జీ పిలుపు





**రాయికల్, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
ప్రపంచ దేశాలన్నీ నేడు భారత్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయని, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం దిశగా దేశం వేగంగా ప్రయాణిస్తోందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహకార్యవాహ్ ప్రముఖ్ తిరుమల్ జీ అన్నారు. రాయికల్ పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న తిరుమల్ జీ మాట్లాడుతూ దేశ ఔన్నత్యం, అభివృద్ధి కోసం ప్రతి భారతీయుడు తన బాధ్యతను గుర్తించి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతీయ సమాజం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, దేశ భవిష్యత్తు కోసం ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆడపిల్లలు లవ్ జిహాద్ వంటి మోసపూరిత పరిణామాల బారిన పడకుండా కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. భారతదేశంలోని ఆరు లక్షల గ్రామాల్లో నిత్య శాఖలు నిర్వహించే లక్ష్యంతో ముందుకు సాగాలని తెలిపారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 4 వరకు ప్రతి గ్రామంలో శాఖ కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేయాలని స్వయంసేవకులకు పిలుపునిచ్చారు.
ప్రతి భారతీయుడు వందేమాతరం గేయాన్ని పూర్తిగా నేర్చుకోవాలని, కుటుంబ రక్షణతో పాటు దేశ రక్షణను కూడా తన బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక ఐక్యతతో సమాజ నిర్మాణంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వయంసేవకులు, విద్యార్థులు,రాయికల్ పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల సాధనకు మహాధర్నా

## సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో పీఆర్టీయూ టీఎస్ ధర్నా





### రాయికల్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

**రాయికల్, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినపెల్లి ఆనంద్‌రావు, ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రాయికల్‌లో బుధవారం నిర్వహించిన పీఆర్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశంలో వారు మాట్లాడారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**పదేళ్ల సేవలకు సన్మానం:**
రాయికల్ మండలంలో గత పది సంవత్సరాలుగా సంఘ బలోపేతానికి కృషి చేసిన మాజీ అధ్యక్షుడు రాపర్తి నర్సయ్యను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేష్, కుంబాల శ్రీనివాస్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కన్నవేని మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాజంగి రాజేశం, జాదవ్ వసంతరావు, రాజ్ మహమ్మద్, జగిత్యాల రూరల్ అధ్యక్షుడు రాచర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఏకగ్రీవం**
పీఆర్టీయూ టీఎస్ రాయికల్ మండల అధ్యక్షుడిగా అంతడుపుల గంగారాజం, ప్రధాన కార్యదర్శిగా దొంతి సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా కడకుంట్ల అభయ్‌రాజ్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా గుండేటి తరంగిణి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చిలివేరి రమేష్, గాజుల కిరణ్, మహిళా ఉపాధ్యక్షులుగా సంగర్తి శోభ, కొక్కుల సుజాత, కార్యదర్శులుగా నాంపల్లి హరికృష్ణ, ఏలేటి ప్రతాప్, మహిళా కార్యదర్శులుగా పర్లపల్లి స్వర్ణలత, పొన్నాల ప్రవళికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బంజారా సంస్కృతికి ప్రతీక తీజ్ పండుగ: మంత్రి సీతక్క





**జీడీ మల్లంపల్లి, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలో బంజారా సమాజం ఆధ్వర్యంలో తీజ్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై బంజారా సోదర సోదరీమణులతో ఆత్మీయంగా ముచ్చటించి తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రత్యేకమైన గుర్తింపు కలిగి ఉందన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న బంజారా ఆచారాలు,సాంస్కృతిక విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బంజారా సమాజ సంక్షేమం,అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి, బంజారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వారు సమర్పించిన వినతులపై సానుకూలంగా స్పందించిన మంత్రి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తీజ్ వేడుకల్లో బంజారా మహిళలు, యువత సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. దీంతో రామచంద్రపూర్ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్,పీఏసీఎస్ చైర్మన్ బొక్కా సత్తిరెడ్డి,ములుగు ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,బంజారా సంఘం నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మానవతా మూర్తి స్ఫూర్తితో ఆశా వర్కర్లకు ఘన సన్మానం

**రాయికల్, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
మానవతా మూర్తి మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ రాయికల్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. సమాజ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మదర్ థెరిస్సా ఆశయాలను స్మరించుకుంటూ,ప్రజారోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న ఆశా వర్కర్ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ మాట్లాడుతూ,మదర్ థెరిస్సా అనాథలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, నిరాశ్రయులు, కుష్టు రోగుల సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. కులమత భేదాలకు అతీతంగా ప్రతి మనిషిలో మానవత్వాన్ని చూసి సేవ చేసిన మహనీయురాలని పేర్కొన్నారు. అదే సేవా స్ఫూర్తితో ఆశా వర్కర్లు పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేస్తున్నారని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, పేదలకు ఆరోగ్య అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వారు కీలక



బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో చార్టర్డ్ ప్రెసిడెంట్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, సెక్రటరీ కనపర్తి శ్రీనివాస్, ట్రెజరర్ సుధవేని మురళీగౌడ్, మ్యాకల రమేష్,మచ్చ శేఖర్, ఆడెపురం ప్రసాద్, దాసరి గంగాధర్, సంకోజు అశోక్, పులి రమేష్, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, సామల సత్యనారాయణ, బుర్ర మహేష్,ఎద్దండి దివాకర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి నిదర్శనం మదర్ థెరిసా సేవలు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
మరణశయ్యపై ఉన్న అనాథలు, పేదలు దిక్కులేకుండా చనిపోకూడదనే ఉద్దేశంతో మదర్ థెరిసా స్థాపించిన సంస్థలు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనాలని హెచ్‌సీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

బుధవారం మాదాపూర్ స్వాతి హైస్కూల్‌లో కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతన మదర్ థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు.

మానవ సేవే మాధవ సేవగా భావించి సమాజంలో అట్టడుగు వర్గాల కోసం థెరిసా చేసిన కృషిని వెంకటేశ్వరరావు, రాగం మల్లికార్జున యాదవ్, ప్రిన్సిపాల్ చంద్రిక గుర్తుచేశారు.

ఇదే స్ఫూర్తితో సమాజంలో వివిధ రంగాల్లో అంకితభావంతో పనిచేస్తున్న ఎం. అరుణ, ఎం. వెంకటరావు, డాక్టర్ కె. అరుణశ్రీ, డాక్టర్ రాజ్ కుమార్ లట్టుపల్లి, జి.ఎస్.డి. గుప్తాలను



గుర్తించి నిర్వాహకులు సేవారత్న పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.
పురస్కార గ్రహీతలు స్పందిస్తూ ఈ గుర్తింపు మరింత బాధ్యతను పెంచిందని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, రామన్న, డి.వి.కె.రావు, సుబ్బారావు, వాణీ సాంబశివరావు, విష్ణు ప్రసాద్, పాలం శీను, శివరాం రెడ్డి, బాలన్న, సాంబశివరావు, శాంతి కుమార్, లతాగుప్త, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు ఎంతో అవసరమని, మహిళలకు ఉపాధి కల్పించే ప్రతి ప్రయత్నానికి ప్రభుత్వం అండగా ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. మహిళలకు శిక్షణ అందించి, స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్న మదర్ తెరీసా బహుజన సేవా సమితి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

గురువారం గుంటూరు వికాస్ నగర్‌లో మదర్ తెరీసా బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, టైలరింగ్ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనసేన నాయకురాలు, మాజీ కార్పొరేటర్ అభ్యర్థి, మిర్చియార్డ్ డైరెక్టర్ కటకం శెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మదర్ తెరీసా బహుజన సేవా సమితి చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబాలు, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

తొలి విడతగా 50 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ అందించడంతో పాటు రాయితీ ధరకు ఉషా కంపెనీ కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. సాధారణంగా రూ. 8 వేల విలువ చేసే కుట్టు మిషన్‌ను రూ. 4 వేలకే అందించడం ద్వారా మహిళలపై ఆర్థిక భారం తగ్గించేందుకు నిర్వాహకులు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మదర్ తెరీసా బహుజన సేవా సమితి పనిచేస్తోందని చెప్పారు. ఈ లక్ష్య సాధనకు విజయలక్ష్మి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్నట్లుగా ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలన్న లక్ష్యానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశిస్తున్నట్లుగా ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని గళ్ళా మాధవి అన్నారు. మహిళలు మహిళలకు అండగా నిలిచి, ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు.

ఇప్పటికే టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఒక్కో బ్యాచ్‌లో 50 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని బ్యాచ్‌లను నిర్వహించి పెద్ద సంఖ్యలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళలను ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వంతో పాటు పలు సంస్థలు, సేవా కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే చెప్పారు. మహిళలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సి యం.సాయి కాంత్ వర్మ గురువారం పరిశీలించారు.

రెండంతస్తుల భవనం మొత్తాన్ని కలియతిరిగి పరిశీలించిన కలెక్టర్, భవన నిర్మాణ ప్రస్తుత పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. భవనంలోని వివిధ విభాగాలు, నిర్మాణ పనుల పురోగతి, ఇంకా చేపట్టాల్సిన పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ భవనాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు.

అనంతరం అంబేద్కర్ భవనం పక్కనే ఉన్న బుద్ధశ్రీ ఆర్కియాలజికల్ మ్యూజియంను జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. మ్యూజియంలోని చారిత్రక, పురావస్తు ప్రాధాన్యత కలిగిన అంశాలను పరిశీలించి, వాటి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమం లో కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిల్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి దుర్గాబాయి, తహసీల్దార్ కిరణ్, నిర్వాహకులు మేడిద బాబూరావు తదితరులు ఉన్నారు.

## గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలి



- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలి : కమిషనర్ కె. మయూర్ అశోక్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటిపై సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ఈ సందర్భంగా కమిషనర్ సమీక్షించారు.

వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల పరిధిలోని డోర్ నంబర్ల వివరాలను పట్టణ ప్రణాళిక విభాగం టీపీవోలు, ఆర్ఐలు సమన్వయంతో పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు అనుగుణంగా సిబ్బందికి వార్డుల వారీగా బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటుకు అనువైన హాళ్లను గుర్తించాలని సిటీ ప్లానర్‌కు సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని సమకూర్చేందుకు మేనేజర్ తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సర్వే, విచారణకు సంబంధించిన అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న కమిషనర్.. ప్రతి నోటీసును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం విచారణ చేపట్టాలని సూచించారు. ఏఈఆర్‌ఓలు తమ పరిధిలో ఎన్నికల సంబంధిత ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ జి. సాంబశివరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, డిప్యూటీ తహసీల్దార్లు నాగ మల్లేశ్వరరావు, కిరణ్మయి, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):**కడప పార్లమెంట్ సభ్యులు జిల్లా ముద్దుబిడ్డ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బ్రహ్మంగారిమఠంలో ఘనంగా నిర్వహించారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు మండల ఉపాధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి మైదుకూరు నియోజకవర్గానికి చెందిన భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు వైఎస్ అవినాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భూమిరెడ్డి శివనారాయణరెడ్డి, చెంచయ్యగారిపల్లె రామ్మోహన్‌రెడ్డి, సిద్ధు రమణారెడ్డి, బద్దెల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎత్తపు సుదర్శన్‌రెడ్డి ఉత్పత్తి గోపాల్‌రెడ్డి, ఉత్పత్తి సుబ్బారెడ్డి, నాగిరెడ్డి నరసింహారెడ్డి, సోమిరెడ్డిపల్లె బీఎల్ఓ సుబ్బారెడ్డి, లక్ష్మీరెడ్డి, వనిపెంట రామ్మోహన్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ పంచాయతీ యువజన అధ్యక్షుడు), పెసల రవిశంకర్‌రెడ్డి (పంచాయతీ జనరల్ సెక్రటరీ), రమా సీను, రమణయ్య, ప్రభాస్ చెన్నకేశవరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, కల్లూరి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్లో అభివృద్ధికి పట్టం కడతాం : ఎమ్మెల్యే నసీర్

- అన్ని ప్రాంతాలకు మహర్దశ తీసుకొస్తున్నాం
- రూ.8.75 కోట్లతో డ్రెయిన్లు, మంచినీటి పైపులైన్ల, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**నియోజకవర్గంలోని ఎన్నో ఏళ్లుగా వెనకబడిన ప్రాంతమైన ప్రగతి నగర్లో అభివృద్ధికి పట్టం కడుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ప్రగతి నగర్, బాలాజీ నగర్ నందమూరి కాలనీ ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణానికి రూ. 8.75 కోట్లతో ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రెయిన్లు, రోడ్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ప్రధాన ప్రాంతాల్లో సైతం రోడ్లు నిర్మాణం చేపట్టిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మారుమూల కాలనీలకు మంచినీళ్లు కూడా అందించలేదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ. 350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వంద కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశామని తెలిపారు. తల్లికి వందనం అమలుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారన్నారు. ఇప్పటికే గూగుల్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి తరలివచ్చాయని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి సేవలో ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని గురువారం రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మాచర్ల టౌన్ టిడిపి అధ్యక్షుడు కొమెర దుర్గారావు దర్శించుకున్నారు. వీరికి మఠం యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. స్థానిక మండల బీసీ చైతన్య సమితి కోశాధికారి రెడ్ల దిన్నె ఖాదరయ్య తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త దగ్గరుండి వారికి ప్రత్యేక ఏర్పాట్లు ఏర్పాటు చేశారు. వీరి వెంట స్థానిక తెలుగుదేశం నాయకులు మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి మఠంలో అవినీతి విచారణ తూతూ మంత్రంగా..?



- ప్రెస్ మీట్ పెట్టకుండానే వెనుదిరిగిన రాయలసీమ జోన్ డిప్యూటీ కమిషనర్
- సన్మానంతో సరిపెట్టుకున్నారన్న విమర్శలు

**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్):**జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి మఠంలో అవినీతి ఆరోపణలపై చేపట్టిన విచారణ తూతూ మంత్రంగా ముగిసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పదవీ విరమణ పొందిన మాజీ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు వచ్చిన రాయలసీమ జోన్ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు విలేకరుల సమావేశం నిర్వహించకుండానే వెళ్లిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

గురువారం ఉదయం 10 గంటల నుంచి మఠం సిబ్బందిని విచారించిన డిప్యూటీ కమిషనర్,అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంలో అక్కడికి వెళ్లిన విలేకరులు వివరణ కోరగా తనిఖీ పూర్తయిన తర్వాత ప్రెస్ మీట్ పెట్టి అన్ని వివరాలు వెల్లడిస్తామని హామీ ఇచ్చారు. అయితే తనిఖీ అనంతరం ఎలాంటి ప్రకటన చేయకుండా,పత్రికా సమావేశం నిర్వహించకుండానే వెనుదిరగడంతో విచారణ ఏమైందనే ప్రశ్న తలెత్తుతోంది..?!

**పదేళ్లుగా ఇదే తంతు..:** మఠం మాజీ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారిపై 2015 నుంచి నేటి వరకు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దేవాదాయ శాఖ అధికారులు విచారణ పేరుతో వచ్చి వెళ్లడమే పరిపాటిగా మారిందని,కానీ చర్యలు మాత్రం శూన్యమని భక్తులు ఆరోపిస్తున్నారు.

**అధికారుల తీరుపై అనుమానాలు:**విచారణకు వచ్చిన అధికారికి మఠం వర్గాలు పుస్తకాలు అందజేసి ఘనంగా సన్మానం చేయడం (ఫోటోలో ఉన్నట్లు) చర్చనీయాంశమైంది. అవినీతి విచారణకు వచ్చి సన్మానాలు స్వీకరించి వెళ్లడమేంటని గ్రామస్తులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అధికారులు కూడా మఠం అవినీతికి వంత పాడుతున్నారని,మామూళ్ల మత్తులో విచారణను నీరుగారుస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాబట్టి ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా వ్యవహరించే ఉన్నతాధికారితో సమగ్ర విచారణ జరిపించి, బ్రహ్మంగారి మఠంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని భక్తులు,గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

- గుంటూరు జిల్లా వ్యాప్తంగా పోలీసుల ప్రత్యేక తనిఖీలు
- 32 ఎఫ్ఐఆర్‌లు, 72 పెట్టి కేసులు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 'ఓపెన్ డ్రింకింగ్'పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 32 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 72 పెట్టి కేసులు నమోదు చేశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తుల వల్ల మహిళలు, చిన్నారులు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడమే ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.

ప్రత్యేక బృందాలు ముఖ్యమైన కూడళ్లు, మద్యం దుకాణాల సమీప ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, పార్కులు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసరాలు, నిర్మానుష్య రహదారులపై విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేశారు. అదుపులోకి తీసుకున్న వారికి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు వివరించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

**నిరంతరం ప్రత్యేక డ్రైవ్‌లు:** సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలు, చిన్నారులు, సాధారణ ప్రజలు ఎలాంటి భయం లేకుండా రాకపోకలు సాగించేలా సురక్షిత వాతావరణం కల్పించడం పోలీసుల ప్రధాన ప్రాధాన్యత అని తెలిపారు.

మద్యం దుకాణాల యజమానులు తమ దుకాణాల వద్ద లేదా పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించేందుకు అనుమతిస్తే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'ఓపెన్ డ్రింకింగ్'పై ప్రత్యేక తనిఖీలు ఇకపై కూడా నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

**ప్రజలు సమాచారం ఇవ్వాలి:** తమ ప్రాంతాల్లో ఎక్కడైనా బహిరంగంగా మద్యం సేవించడం, మద్యం సేవించి గొడవలకు పాల్పడటం, మహిళలకు ఇబ్బందులు కలిగించడం వంటి ఘటనలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 100, 112 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## రక్షాబంధన్ సోదరభావానికి, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

- బ్రహ్మకుమారీస్ ధ్యాన కేంద్రంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
- ఆధ్యాత్మికత, మానవతా విలువల పెంపులో బ్రహ్మకుమారీస్ కృషి అభినందనీయం
- చీఫ్ విప్ జీవీకు పవిత్ర రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్ సోదరీమణులు



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):**రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా వినుకొండ పట్టణంలోని ఇసుక వాగు బజార్‌లో ఉన్న బ్రహ్మకుమారీస్ ధ్యాన కేంద్రంలో రక్షాబంధన్ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సోదరీమణులు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గారికి పవిత్ర రాఖీ కట్టి వేద ఆశీర్వచనాలతో ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆయన ధ్యాన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని, ఆధ్యాత్మికత ప్రాధాన్యతను వివరించారు.

ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రక్షాబంధన్‌కు విశిష్టమైన స్థానం ఉందన్నారు. రాఖీ కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధానికి మాత్రమే కాకుండా పరస్పర గౌరవం, విశ్వాసం, సోదరభావం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ప్రస్తుత సమాజంలో ఒత్తిళ్లు, విభేదాలు పెరుగుతున్న తరుణంలో ఆధ్యాత్మిక చింతన, ధ్యానం, మానవతా విలువలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరిలోనూ సానుకూల ఆలోచనలు, ఆత్మవిశ్వాసం, సేవాభావాన్ని పెంపొందించేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు, సోదరీమణులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు దివ్యాంగులకు, ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ ను శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక గ్రీవెన్స్ ఉదయం 10 గంటల నుండి జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో గల ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జరుగుతుందని చెప్పారు. జిల్లా అధికారులు అందరూ హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

## సేవల్లో కడప జిల్లాలోనే మొదటి స్థానంలో నిలవాలి : డిఎంఅండ్‌హెచ్ఓ యుగంధం

- పలు పిహెచ్సి లను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. పి. యుగంధర్
- మాతా-శిశు ఆరోగ్య సేవలపై వైద్యాధికారులతో విస్తృత సమీక్షాసమావేశం

**పోరుమామిళ్ల (జర్నలిస్ట్ ఫైల్):**గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును బలోపేతం చేస్తున్నామని వైఎస్ఆర్ కడప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ తెలిపారు. గురువారం పోరుమామిళ్ల పట్టణంలోని టేకురిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఈ-హెల్త్ రికార్డ్స్ నిర్వహణ, ఫార్మసీలో మందుల నిల్వలు ఇ డి డి క్యాలెండర్ వ్యాక్సినేషన్ విభాగం మరియు రోగ నిర్ధారణ ల్యాబోరేటరీలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, రోగులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది అందరూ సమిష్టి బాధ్యతతో పనిచేసి ఈ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ఎం. సి హెచ్ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై విస్తృత సమీక్ష**

తనిఖీ అనంతరం పోరుమామిళ్ల టేకూరుపేట, కలసపాడు, నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో మాతా-శిశు ఆరోగ్యం మరియు జాతీయ వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలుపై డాక్టర్ యుగంధర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు మరియు నవజాత శిశువులకు క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం సాధించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రతీ ఒక్కరికీ వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జె. ప్రవీణ్ కుమార్ ఆర్. బి ఎస్ కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆరిఫ్, జిల్లా మలేరియా అధికారి, బద్వేలు డిప్యూటీ డి. ఎం ఢహెచ్. ఒ డాక్టర్ మల్లేష్, డిపిఓ నారాయణ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సాదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అలాగే వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ (కలసపాడు), డాక్టర్ మేరీ ఎలీషా, డాక్టర్ జయరామ్ (టేకూరుపేట), డాక్టర్ ప్రశాంతి (నరసాపురం), డాక్టర్ శ్రీవిద్య (పోరుమామిళ్ల)లతో పాటు పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు మరియు ఆసుపత్రి వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారిగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.
గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించేందుకు ప్రత్యేక వేదిక కల్పిస్తూ, వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మహిళలకు అండగా నిలవడమే లక్ష్యంగా మహిళా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని వివిధ సమస్యలతో వచ్చిన మహిళల నుంచి అర్జీలను స్వీకరించారు. మహిళలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతులు సమర్పించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణం కల్పించడమే మహిళా గ్రీవెన్స్ డే ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు నిర్ణీత సమయంలోపు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలు, కుటుంబ, సామాజిక అంశాలకు సంబంధించిన పలు సమస్యలను మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అర్జీలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.
మహిళలకు న్యాయం జరిగేలా, వారి సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా నిరంతరం అందుబాటులో ఉంటామని గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఇటువంటి గ్రీవెన్స్ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

## 'ఇరుముడి' సినిమాలో పాఠశాల విద్యను కించపరిచే దృశ్యాలు తొలగించాలి: ఆప్టా

- **విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ప్రస్తుతం ప్రదర్శితమవుతున్న 'ఇరుముడి' సినిమాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యను, ఉపాధ్యాయ వృత్తిని కించపరిచేలా ఉన్న దృశ్యాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నాయకులు డిమాండ్ చేశారు.
ఈ మేరకు ఆప్టా పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జి.ఎస్. గణపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాశ్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహదీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినిమాలో ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల బోర్డును, ప్రభుత్వం సరఫరా చేస్తున్న పాఠశాల యూనిఫాంను, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి పాత్రను తప్పుగా చిత్రీకరించారని వారు ఆరోపించారు. ఇటువంటి చిత్రీకరణ ప్రభుత్వ పాఠశాల విద్యపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.
తల్లిదండ్రుల తర్వాత సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన స్థానం ఉందని, అలాంటి ఉపాధ్యాయ వృత్తిని కించపరిచే విధంగా పాత్రను చిత్రీకరించడం బాధాకరమని ఆప్టా నాయకులు పేర్కొన్నారు. వాణిజ్య ప్రయోజనాల కోసం విద్యాశాఖకు, ప్రభుత్వ పాఠశాలలకు మచ్చతెచ్చేలా సన్నివేశాలను రూపొందించడం సరికాదన్నారు. చిత్ర దర్శకుడు గతంలో తాను ఉపాధ్యాయుడిగా పనిచేశానని పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించిన ఆప్టా నాయకులు.. ఉపాధ్యాయ వృత్తి పట్ల అవగాహన ఉన్న వ్యక్తి ఒక ఉపాధ్యాయుడి పాత్రను ఈ విధంగా ఎలా చిత్రీకరించారని ప్రశ్నించారు. 'ఇరుముడి' సినిమాలోని అభ్యంతరకర దృశ్యాలను పరిశీలించి, వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను వారు కోరారు. ఈ అంశంపై మంత్రి, పాఠశాల విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే వ్రాతపూర్వకంగా లేఖలు అందజేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలను, ఉపాధ్యాయులను కించపరిచే విధంగా చిత్రీకరించడం విద్యాశాఖ ప్రతిష్ఠను దెబ్బతీయడమేనని పేర్కొన్న వారు.. ఈ విషయాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించి, నిబంధనల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## సీపీఎస్ ఉద్యోగుల పట్ల వివక్షకు ముగింపు పలకాలి

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** సీపీఎస్ ఉద్యోగుల పట్ల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆర్థిక, పెన్షన్ సంబంధిత అసమానతలకు ప్రభుత్వం తక్షణమే ముగింపు పలకాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పునరుద్ధరణతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే అందించాలని కోరారు. సెప్టెంబర్ 1న ఏపీసీపీఎస్‌ఈఏ చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటించారు. సీపీఎస్ ఉద్యోగులు దాదాపు పదేళ్లుగా తమ పెన్షన్ భద్రత, ఆర్థిక హక్కుల కోసం ఉద్యమిస్తున్నప్పటికీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం ఆందోళనకరమన్నారు. 2019 ఏప్రిల్ 1 నుంచి అఖిల భారత సర్వీసు అధికారులకు అమలు చేస్తున్న 14 శాతం పెంపును సీపీఎస్ ఉద్యోగులకు వర్తింపజేయకపోవడం వివక్షకు నిదర్శనమన్నారు.
2018 జూలై, 2019 జనవరి డీఏ బకాయిలను పాత పెన్షన్ పరిధిలోని ఉద్యోగులకు 2022లోనే చెల్లించినప్పటికీ, సీపీఎస్ ఉద్యోగుల్లో సగానికి పైగా మందికి ఇప్పటికీ అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఒక్కో ఉద్యోగికి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలకు పైగా బకాయిలు రావాల్సి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన చెల్లింపులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం సమర్థనీయం కాదన్నారు. మరణించిన సీపీఎస్ ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లోని ఉద్యోగి వాటాకు సంబంధించిన ప్రయోజనాలను అర్హులైన కుటుంబాలకు వెంటనే అందించాలని కోరారు. డీఏ బకాయిలన్నింటినీ తక్షణమే చెల్లించడం, 14 శాతం పెంపులో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడం, ఆర్థిక ఉత్తర్వులను పూర్తిస్థాయిలో అమలు చేయడం, పాత పెన్షన్ పునరుద్ధరణపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉత్తర్వులు జారీ చేయడం మాత్రమే కాకుండా వాటి ప్రయోజనం అర్హులైన ప్రతి ఉద్యోగికి సకాలంలో అందినప్పుడే వాటికి సార్థకత ఉంటుందని స్పష్టం చేశారు.

## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్‌కు మంత్రి లోకేష్ శంకుస్థాపన

- **5.90 ఎకరాల్లో రూ.18.55 కోట్ల వ్యయంతో మోడరన్ రైతు బజార్ నిర్మాణం**




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళగిరి పట్టణం నిడమర్రు రైల్వే గేట్ వద్ద ఆధునిక హంగులతో మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ముందుగా నిడమర్రు రోడ్డులోని శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రాజెక్టు నమూనా చిత్రాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.
**ఆధునిక హంగులతో మంగళగిరిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు :** మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి లోకేష్ మోడరన్ రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 5.90 ఎకరాల విస్తీర్ణంలో, అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులు రూ.18.55 కోట్ల వ్యయంతో ఈ రిటైల్‌డహోల్ సేల్ కూరగాయల మార్కెట్ ను నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఏర్పాటుచేయనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులు. రిటైల్ మార్కెట్ లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60 షాపులు ఏర్పాటుచేస్తారు.
హోల్ సేల్ మార్కెట్ లో అన్ లోడింగ్ ప్లాట్ ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. సరుకులు తరలించే వాహనాలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు.
ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ జీ.భీముడు, ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, రూరల్ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశంనేని శ్రీఅనిత పాల్గొన్నారు.

## హోటల్ కళావిలాస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని చెంచుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన కళావిలాస్ హోటల్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. ఆహార వ్యాపారంలో నాణ్యత, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సేవలు అందిస్తూ వారి ఆదరణ పొందాలని అన్నారు.
ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాజా, నాణ్యమైన పదార్థాలతో ఆహారాన్ని తయారు చేయాలని హోటల్ నిర్వాహకులకు సూచించారు. వ్యాపారంలో నాణ్యతను కొనసాగిస్తే వినియోగదారుల విశ్వాసాన్ని పొందడంతో పాటు సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.
కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, హోటల్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీసీపీడీసీఎల్ మరో కీలక ముందడుగు



**మాచర్ల (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ పథకంలో భాగంగా వ్యవసాయ విద్యుత్ ఫీడర్లను సౌర విద్యుత్‌తో అనుసంధానించే కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ మరో కీలక ముందడుగు వేసింది. పల్నాడు జిల్లా మాచర్ల డివిజన్‌లోని నెహ్రూ నగర్ తండాలో ఏర్పాటు చేసిన మూడు మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను సంస్థ సీఎండీ పి.పుల్లారెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో ఈ పథకం కింద గ్రిడ్‌కు అనుసంధానం అవుతున్న తొలి సౌర విద్యుత్ ప్లాంట్‌గా ఈ ప్రాజెక్టు ప్రత్యేక గుర్తింపు పొందింది.
పథకంలోని సీ భాగం కింద ఫీడర్ స్థాయి సౌరీకరణకు సంస్థ ప్రాధాన్యత ఇస్తోందని సీఎండీ తెలిపారు. వ్యవసాయ అవసరాలకు వినియోగించే 33/11 కేవీ ప్రత్యేక లేదా మిశ్రమ విద్యుత్ ఫీడర్లకు అనుసంధానమైన వ్యవసాయ పంపుసెట్లకు పగటిపూట సౌర విద్యుత్ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ పథకానికి కేంద్ర ఆర్థిక సహాయం కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు.
ప్రస్తుతం సుమారు 65 వేల వ్యవసాయ పంపుసెట్ల సౌరీకరణ పనులు కొనసాగుతున్నాయని, ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో మొత్తం 191.5 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఏర్పాటవుతోందని పుల్లారెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లాలో 17 మెగావాట్లు, ఎన్టీఆర్ జిల్లాలో 23 మెగావాట్లు, పల్నాడు జిల్లాలో 42.5 మెగావాట్లు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 109 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయని వివరించారు.
నెహ్రూ నగర్ తండాలోని మూడు మెగావాట్ల ప్లాంట్‌లో ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి అనుసంధానం చేసి, దాని పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు పగటిపూట విద్యుత్ సరఫరా చేయనున్నట్లు సీఎండీ వెల్లడించారు.
దీనివల్ల రైతులకు మరింత స్థిరమైన, విశ్వసనీయమైన విద్యుత్ సరఫరా అందడంతోపాటు పునరుత్పాదక ఇంధన వినియోగం పెరుగుతుందని అన్నారు. ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేసిన సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అండ్ హెచ్ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి, పల్నాడు పవర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, అధికారులు, సిబ్బంది, భాగస్వామ్య సంస్థలకు ఆయన అభినందనలు తెలిపారు.
నెహ్రూ నగర్ తండా సౌర విద్యుత్ ప్లాంట్ విజయంతో వ్యవసాయ విద్యుత్ అవసరాలను పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా తీర్చే దిశగా ఏపీసీపీడీసీఎల్ మరో ముందడుగు వేసిందని పుల్లారెడ్డి అన్నారు.
రాష్ట్రంలో భవిష్యత్తులో సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి స్థిరమైన, విశ్వసనీయమైన, పర్యావరణహిత విద్యుత్ వ్యవస్థను నిర్మించేందుకు సంస్థ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అండ్ హెచ్ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి, పల్నాడు సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజయ్‌కుమార్, మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింగయ్య, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి

- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆదేశం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ప్రాథమిక సమాచారం ప్రకారం ఆరుగురు మృతి చెందడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు.
చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారు ప్రమాదంలో మృతి చెందినట్లు అధికారులు తెలిపారని మంత్రి పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. అవసరమైన వైద్య సేవలను తక్షణమే అందుబాటులో ఉంచాలని సూచించారు.
గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రికి తరలిస్తున్న క్షతగాత్రుల్లో ఒకరు మార్గమధ్యంలోనే మృతి చెందారని, విషమ పరిస్థితిలో ఉన్న మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన మిగిలిన నలుగురిలో ఇద్దరు చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయినట్లు దుర్గాప్రసాద్ వెల్లడించారు. మరో ఇద్దరికి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కొనసాగుతోందని, వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. వైద్యులు నిరంతరం వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య సేవలను అందించాలని మంత్రి సత్యకుమార్ అధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రమాద ఘటనకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాద ఘటనపై అధికారులు సమన్వయంతో వ్యవహరించి సహాయక, వైద్య చర్యలను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా కంటి వైద్య శిబిరం

- **శంకర్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు దృష్టి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెదకాకానికి చెందిన శంకర్ ఐ హాస్పిటల్ సహకారంతో కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.
శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలు, ఇతర కంటి సంబంధిత సమస్యలను గుర్తిస్తున్నారు. అవసరమైన వారికి వైద్య సలహాలు, తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు అందిస్తున్నారు.
శంకర్ ఐ హాస్పిటల్ వైద్య బృందానికి చెందిన డా. కుష్మిత, ఎం.ఎస్. (ఆఫ్తాల్మాలజీ), ఆప్టోమెట్రిస్టులు జానీ, శ్రావణి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర డిజిటల్ పరికరాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎక్కువసేపు స్క్రీన్‌లను చూడకుండా మధ్య మధ్యలో విరామాలు తీసుకోవడంతో పాటు, కంటి సమస్యలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
కళాశాల ప్రిన్సిపాల్ డి. సంజయ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి కళాశాల యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విద్యార్థుల విద్యతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు.
విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన శంకర్ ఐ హాస్పిటల్, పెదకాకాని వైద్య బృందానికి ప్రిన్సిపాల్ డి. సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు.
కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లాల్ జాన్ భాషా మాట్లాడుతూ కంటి వైద్య శిబిరం గురువారం ప్రారంభమై శుక్రవారం సాయంత్రం వరకు రెండు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్వచ్ఛమైన విధులతో దోషరహిత ఓటర్ల జాబితా

- **సర్ ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకే అగ్రస్థానం**
- **ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో చొరవ అభినందనీయం**
- **అక్టోబర్ 3న తుది జాబితా ప్రచురణ వరకు సమష్టి కృషితో ముందుకెళ్లండి**
- **పైస్థాయి నుంచి బీఎల్‌వో వరకు సరైన సమన్వయం, సహకార స్ఫూర్తి కీలకం**
- **జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ**




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ లోపాలకు తావులేకుండా దోషరహితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సమష్టి కృషి అవసరమని.. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు చూపిన చొరవ అభినందనీయమని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అన్నారు.
గురువారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో రాష్ట్రంలో సర్ పురోగతిపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సమీక్షా, పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఈవో వివేక్ యాదవ్, అదనపు సీఈవో ఎస్.డిల్లీరావుతో పాటు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, గుంటూరు కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, పల్నాడు కలెక్టర్ డా. కృతికా శుక్లా, తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి, పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి, బాపట్ల కలెక్టర్ డా. వి.వినోద్ కుమార్, ఆయా జిల్లాల ఈఆర్‌వోలు ప్రత్యక్షంగా హాజరుకాగా వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు. ప్రస్తుతం నోటీసుల జారీ, విచారణ, క్లెయిములు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్.. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 43,71,397 నోటీసుల పంపిణీ కాగా 16,23,774 నోటీసులపై క్షేత్రస్థాయిలో విచారణ పూర్తయింది. ఈ నేపథ్యంలో నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలో ముందంజలో ఉన్న జిల్లాలను అభినందిస్తూ.. మిగిలిన జిల్లాల్లోనూ నాణ్యంగా, వేగంగా, పారదర్శకంగా సర్ స్ఫూర్తికి అనుగుణంగా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు దిశానిర్దేశం చేశారు. నోటీసులపై విచారణకు సంబంధించి ప్రస్తుతానికి అత్యల్పంగా 15.18 శాతం మాత్రమే పెండింగ్ ఉన్న కర్నూలు జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీల మధ్య సమన్వయం, సహకారం అనేవి ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కీలకమని.. ఎవరికి ఏ సందేహమున్నా నివృత్తి చేయడం, సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు సంతృప్తికరంగా అందించడంలో ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ సూచించారు. ప్రస్తుత దశలో జిల్లాల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిబంధనల ప్రకారం సరైన కార్యాచరణపైనా సమావేశంలో చర్చించారు. వృద్ధాప్యం, అనారోగ్యం వంటి వివిధ కారణాల వల్ల విచారణకు హాజరుకాలేని పక్షంలో ఈఆర్‌వో/ఏఈఆర్‌వో – బీఎల్‌వోను సమన్వయం చేసుకుంటూ ఇంటి సందర్శన, వివిధ మార్గాల ద్వారా ఓటర్లకు సహాయసహకారాలు అందించాలన్నారు. అదేవిధంగా నోటీసులపై విచారణ అనంతరం క్వాసీ జ్యుడీషియల్ అధికారి అయిన ఏఈఆర్‌వోలు సమస్యను అర్థం చేసుకొని న్యాయమైన తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశం సందర్భంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, ఫారం–6, ఫారం–7, ఫారం–8 తదితరాల స్వీకరణ, పరిష్కారం తదితర అంశాలనూ డా. పవన్ కుమార్ శర్మ పరిశీలించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467